విశాలాంధ్ర

ఏలూరు
పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 09 ఆగస్టు 2024 8 పేజీలు

రాష్ట్రానికి 1400 కొత్త బస్సులు

- ప్రయాణీకులకు భద్రత, సుఖప్రయాణానికి ప్రాధాన్యత
- రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్రంలో ఆర్టీసీకి 1400 కొత్త బస్సులు కొనుగోలుచేశామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చెప్పారు. స్థానిక ఆర్టీసీ బస్సు డిపోలో గురువారం విజయవాడ జోన్ 2కు సంబంధించిన 26 స్టార్ లైనర్, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులను శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తామని, ప్రయాణీకులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందిస్తామన్నారు. ప్రభుత్వానికి, ప్రయాణీకులు కార్మికులు రెండు కళ్ళు లాంటి వారని, కార్మికుల, ప్రయాణీకుల క్షేమం తమకు ముఖ్య మన్నారు. సిబ్బంది కూడా ప్రయాణీకులు అధికంగా ప్రయాణించి ఆక్యుపెన్సీ రేషియో పెరిగేలా పనిచేయాలన్నారు. ఈనెల 15వ తేదీ నుండి రాష్ట్రంలో మొదటిదశలో అన్నా క్యాంటిన్లు ప్రారంభిస్తున్నామన్నారు. .రాష్ట్ర ప్రజారవాణా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాధరెడ్డి, ఉప రవాణా కమిషనర్ ఎస్. శాంతకుమారి, ఏలూరు ఆర్టీఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి, ఏలూరు,తూర్పుగోదావరి, కాకినాడ, కృష్ణా జిల్లాల ప్రజా రవాణాధికారులు ఎన్.వి.ఆర్. వరప్రసాద్, షర్మిల, శ్రీనివాసరావు, వాణి , ఏలూరు డిపో మేనేజర్ వాణి , ప్రభుతులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ సమ్మేళనాలు జయప్రదం చేయండి

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కాకినాడ : ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయుసి) జాతీయ సమితి సమ్మేళనాలు విశాఖపట్నంలో సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో జరగనున్నాయని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ వెల్లడించారు. గురువారం ఏఐటీయూసీ అనుబంధ ప్రజా సంఘాలు మున్సిపల్, మెడికల్, ఎలక్ట్రిసిటీ, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకత్వం ఆధ్వర్యంలో కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయం ఎదుట ఏఐటియుసి జాతీయ సమితి సమ్మేళనాల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తోకల ప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేట్ సంపదను పున: పంపిణీ చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 మంజూరు చేయాలని, కాంట్రాక్టు వ్యవస్థ రద్దు చేసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం కాకుండా ప్రభుత్వంలోనే కొనసాగించాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఇసుక పాలసీ విధానం ఎక్కడ అమలు కావడం లేదని, పత్రికల, ప్రచారాలకు తప్ప ఆచరణలో శూన్యం అని ప్రసాద్ అన్నారు. ప్రజా సంఘాల నిర్మాణాలు, కార్మిక సంఘాల సమస్యలపై పోరాటాలు, ఉద్యోగ భద్రత, కనీస వేతనాల అమలు తదితర డిమాండ్ల సాధనకై సమ్మేళనాలు ఆంధ్రప్రదేశ్లో నిర్వహిస్తు న్నామని ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి శ్రీనివాస రావు, తుపాకుల లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ శేఖర్, బంగారు రాజేష్, కే రామయ్య, అనిల్, భాను, నారాయణరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు

విశాలాంధ్ర - అమలాపురం : 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను త్రివర్ణ పతాక చరిత్ర, ప్రాముఖ్యత, ఎగుర వేయడంలో పాటించాల్సిన నియమాలు శాస్త్ర యుక్తంగా ఆచ రిస్తూ ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్ట రేట్లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నిశాంతి, జిల్లా అడ్మిన్ ఎస్పి ఖాదర్ భాషాలు జిల్లా సమన్వయ కమిటీ అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం పూర్తి సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఆగస్టు 15వ తేదీ ఉదయం నుంచి జరిగే స్వాతంత్ర్య వేడుకలకు జిల్లా ప్రజలు, స్వాతంత్ర్య సమరయోధుల కుటంబీకులు, ఇతర ప్రముఖులు ఆహ్వానితులేనని పేర్కొన్నారు. స్థానిక రెవిన్యూ డివిజనల్ అధికారి వారు స్టేజ్ అలంకరణ, వివిధ గ్యాలరీలు సీట్ల ఏర్పాటు, అతిథి మర్యాదలతో పాటు స్నాక్స్ ఏర్పాటు, సౌండ్ సిస్టం, స్టేడియంలో అవసరమైన మేరకు మరమ్మతులు ముందస్తుగా చేపట్టాలని ఆదేశించారు. స్థానిక పురపాలక సంఘ కమిషనర్ వారు పారిశుద్యం త్రాగునీరు సరఫరా పై దృష్టి సారించాలన్నారు. పోలీసు అధికారులు జాతీయ పతాక ఆవిష్కరణ, కవాతు గౌరవ వందనం వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ రద్దీ స్టేజ్ వద్ద అవార్డుల క్యూ లైన్‌లో ఏర్పాటు, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై దృష్టి సారించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టాలు స్వాతంత్ర్య సమరయోధుల పరిచయ కార్యక్రమాలు, 1857 నాటి సిపాయిల తిరుగుబాటు ప్లాస్టిక్ వినియోగం పైన వచ్చే అనర్ధాలు అంశాలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులకు కృషి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లా నుండి నాణ్యమైన ఆక్వా ఉత్పత్తుల ఎగుమతి, కార్మికుల సంరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మంది రంలో కలెక్టరు ఆక్వా రైతులు, ఉత్పత్తిదారులు, డీలర్స్, ఎగుమతి దారులు, ఎంపెడ, మత్స్యశాఖ అధికారులు, తదితరులతో సమావేశమై నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులు ఎగుమతులకు తీసుకోవాల్సిన చర్యలు, కార్మికుల సంరక్షణ, ఇన్సూరెన్స్ తదితర అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ రొయ్యల రంగంపై యూఎస్ మీడియా చేస్తున్న ఆరోపణలు, ప్రతికూల ప్రచారంతో రొయ్యల ఎగుమతిపై ప్రభావం పడుతుందన్నారు. ఆక్వా కల్చర్‌లో రాష్ట్రంలో మన జిల్లా తృతీయ స్థానంలో ఉందన్నారు. యూఎస్ పత్రికలు ప్రచారంలో కార్మిక దుర్వినియోగాలు, కార్మికులకు ఎక్కువ పని గంటలు, సరిపడాలేని వేతనాలు, కార్మిక ఒప్పందాలు లేకపోవడం, అపరిశుభ్రమైన పని వాతావరణాలతో సహా శ్రమ దోపిడీ పరిస్థితులను ▶మిగతా 2లో

ప్రణాళికతో పనిచేయండి

కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలోని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలైన వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, సహకార, మార్కెటింగ్, లీడ్ బ్యాంక్, అటవీ శాఖలలో అమలవు తున్న వివిధ కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం నెరవేరే విధంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో పురోగతి కనబరిచే విధంగా అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి జిల్లాలో సాగు దిగుబడి శాతాన్ని పెంచేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 50,500 కౌలు రైతు కార్డులు పంపిణీ చేశామన్నారు. సీసీఆర్సీ కార్డుల నూరు ▶మిగతా 2లో

వరద నీటిలో ఏలూరు కాజ్ వే

రాకపోకలకు తీవ్ర అంతరాయం

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో దిగువకు వరద నీరు విడుదల చేస్తుండడంతో తమ్మిలేరుకు వరద పోటెత్తుతోంది. భద్రాచలంలో కూడా గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండడంతో జంగారెడ్డిగూడెంలోని ఎర్రకాలువ జలాశయంకు, చింతలపూడిలోని నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో డ్యాం కెపాసిటీని బట్టి వరద నీటిని కిందికి దిగువకు విడుదల చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 7వ తేదీన తమ్మిలేరుకు 1000 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయగా ఎగువన ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తుండడంతో ఎనిమిదో తేదీ ఉదయానికి నీటిమట్టం విడుదల పెంచారు. దీంతో ఏలూరులో ప్రధాన ప్రాంతాలకు ▶మిగతా 2లో

తహసీల్దారును మర్యాదపూర్వకంగా కలిసిన సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు

విశాలాంధ్ర-కామవరపుకోట: కామవరపుకోట మండల తహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన జి. ఎలీషాను సిపిఐ మండల కార్య దర్శి టీవీఎస్ రాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో ఏలూరు జిల్లాలోని చింతలపూడి, జీలుగుమిల్లి, వేలేరుపాడు, మండలాల్లో తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించానన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికల ముందు కోనసీమ జిల్లా కొత్తపేట తహసీల్దారుగా ఎన్నికల్లో బాధ్యతలు నిర్వహించానన్నారు. తహసీల్దార్‌తో టీవీఎస్ రాజు మాట్లాడుతూ మండలంలో మౌలిక సమస్యల పరిష్కారంలో తాము కూడా సహకరిస్తామన్నారు.

విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతం

విశాలాంధ్ర-లింగపాలెం: పాఠశాలల విద్యా కమిటీల ఎన్నికలు లింగపాలెం మండ లంలో ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖ అధికారి రవీంద్ర తెలిపారు. మండలంలోని 48 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలకు ఎన్నికల నిర్వహించినట్లు ఈయన తెలిపారు. మండలం లోని మొత్తం 60 ప్రభుత్వ పాఠశాలకు సంబంధించి51 పాఠశాలల్లో ఏకాభిప్రాయంతో విద్యా కమిటీల ఎంపిక జరిగిందని తెలిపారు. వేములపల్లి, అన్నపనేనివారి గూడెం(ఎస్సీ) ములగలంపాడు, పాచ్చానగరం(ఎస్ డబ్ల్యూ) ప్రాథమిక పాఠశాలలో పోటీ జరిగిందని ఈ పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎక్కువ మంది పోటీ పడ్డారని అన్నారు.మెజార్టీ వచ్చిన వారిని చైర్మన్ వైస్ చైర్మన్ గా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఈయన వివరించారు.

వరద నీరు రాకుండా చర్యలు

విశాలాంధ్ర-లింగపాలెం: తమ్మిలేరు రిజర్వాయర్ నీటిని వదలడంతో తమ్మి లేరు కాలువ ప్రక్కన ఉన్న కొణిజర్లలో అధికారులు ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టారు. కాలువ నీరు నివాసాలలోకి వస్తే ప్రజలకు ఇబ్బంది కలగకుండా వీరందరిని మెరక ప్రాంతంలో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పోలీసులు,రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులు గ్రామంలో ఉండి పర్యవేక్షణ చేస్తున్నారు.

గర్భిణీలకు సీమంతం

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం: తల్లిపాల వారోత్సవాలలో భాగంగా స్థానిక 33వ వార్డు గొల్లగూడెం లోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం గర్భిణీలకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన 33 వ వార్డు అధ్యక్షులు పడాల శ్రీనివాస్ , తెలుగుదేశంపార్టీ నాయకులు వీర్ల సత్యనారాయణ, వార్డు నాయకులు గొబ్బిళ్ళ శ్రీను, గొబ్బిళ్ళ సుగుణారావు, వీర్ల రాజేశ్, మన్నె శ్రీను, ఎ .ఎన్.ఎం. చినపాప, కే.దుర్గ, వీర్ల నాగమణి గొబ్బిళ్ళ లక్ష్మి, రామతులసి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర - పెంటపాడు: మండలం లోని ప్రభుత్వ పోస్ట్ బేసిక్ పాఠశాలలో పాఠశాల యాజమాన్య ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రధానోపాధ్యాయులు, ఎన్నికల అధికారి ఎన్. రాజేష్ అధ్యక్షతన ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు.ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఒక్కొక్క తరగతి నుండి ముగ్గురు చొప్పున పాఠశాల యాజమాన్య కమిటీ కి సభ్యులుగా 15 మందిని ఎన్నిక చేయగా,వీరిలో ఇద్దరిని చైర్మన్ గా కళింగ లక్ష్మణరావు, వైస్ చైర్మన్ గా కంది వరలక్ష్మి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు కో ఆప్షన్ సభ్యులుగా వెలగల సత్యనారాయణరెడ్డి, తాడేపల్లి మోహన్ రావు లను, ఆరు మంది ఎక్స్ అఫీషియో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

విశాలాంధ్ర -భీమవరం: డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం కోసం యువత ఉద్యమించాలని బార్ అసోసియేషన్ కార్యదర్శి అడబాల ప్రసన్న కుమార్ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజం అనే అంశంపై ఆర్.ఆర్.డి.ఎస్.ప్రభుత్వ కళాశాలలో గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని మాదక ద్రవ్యాల నిరోధక సమాజం కోసం ప్రజల్లో అవగాహన కలిగించాలని అన్నారు. మత్తు పదార్థాలు కొత్తలో చిన్నగా అలవాటై తీవ్రమైన వ్యసనంగా మారుతుందని, మాదక ద్రవ్యాలు కేసులో పట్టుబడి నేరం రుజువైతే జీవితం అంధకారం అవుతుందని ఆయన హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు తాళ్లూరి మధు, రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకాంతం, డాక్టర్ రాజశేఖర్, ధనుంజయ్, అమూల్యారావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

విశాలాంధ్ర-వీరవాసరం : తల్లి పాల ద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అన్నారు. మిషన్ శక్తి 100రోజుల కార్యక్రమం, మరియు తల్లి పాల వారోత్సవాలలో భాగంగా భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో తల్లిపాల వారోత్స వాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు మొదటి గంటలో తల్లి ముర్రిపాలు ఎంతో ముఖ్యమైనవన్నారు. కాపు వనిత క్లబ్ అధ్యక్షులు గుండా రామకృష్ణ మాట్లాడుతూ తల్లిపాల కారణంగా పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగు తుందన్నారు. ఐసిడిఎస్ సీడీపీఓ టి.లక్ష్మీకాంతమ్మ మాట్లాడుతూ శిశువు జన్మించినప్పుడే తల్లి ముర్రిపాలు ఇవ్వడం బిడ్డకు శ్రేయస్కరమని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి కారి మెహసినా తాజ్ మాట్లా డుతూ రేపటితరం వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు తల్లిపాలు ఎంతో ముఖ్యమైన వన్నారు. అనంతరం సామూహిక శ్రీమంతాలు చేశారు.

దాతల సహాయం అభినందనీయం

విశాలాంధ్ర - కలిదిండి: ప్రభుత్వ పాఠ శాలలకు దాతలు చేస్తున్న సహాయం అభినంద నీయమని ప్రధానోపాధ్యాయులు మేక రామారావు అన్నారు. గురువారం మండలం లోని ఆవకూరు గ్రామంలో ఎంపీయుపి పాఠశాలకు నాబార్డ్ ఆంగ్లేయ ఎడ్యుకేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, సి ఎస్ ఆర్ ఫండ్ సౌజన్యంతో కంప్యూటర్లు 6, ఇన్వర్టర్ 1, ప్రింటర్ 1, టేబుల్స్ 6, కుర్చీలు 6 పాఠశాలకు సంస్థ ప్రతినిధులైన పరసా శివప్రసాద్, నున్న సునీల్ కుమార్, కే. ఆనంద్, వి. నేరేంద్ర, ఎం. సురేష్ పాఠశాలలో హెచ్ఎం రామారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎన్. నరసయ్య, సిహెచ్. పార్వతి, చంద్రకాధర్ రావు, కే. శ్రీనివాసరావు, షణ్ముఖ సీతాపతి గుప్తా, జడ్డు వీర వెంకట సత్య నారాయణ, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పనిచేయండి

(1వ పేజీ తరువాయి)

శాతం పంపిణీ పూర్తి చేసి, కౌలు రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ-కాప్ నమోదు, ప్రకృతి వ్యవసాయం కార్యకలాపాలపై దృష్టి పెట్టాలన్నారు. మత్స్య శాఖ ద్వారా పీఎంఎంఎస్వై కింద లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. జిల్లాలోని సహజ వనరులను దృష్టిలో ఉంచుకుని ప్రైమరీ సెక్టార్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో సీపీవో పీ శ్రీనాథ్, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఎన్ విజయ్ కుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్ సూర్యప్రకాశరావుటీ జిల్లా మత్స్య శాఖాధికారి కరుణాకర్, మార్కెటింగ్ ఏడీ ఎం దుర్గాప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, సబ్ డీఫ్ఓ టీ అనూష ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వే

(1వ పేజీ తరువాయి)

వెళ్లే శనివారపు పేట కాజువే పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. ఈ కాజువే మీదుగా తమ్మిలేరు వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహన రాకపోకలను విద్యానగర్, బిషప్ హౌస్ మీదుగా మళ్లించారు. దీంతో అటుగా వెళ్లే వాహన రాకపోకలు భారీగా పెరగడంతో గురువారం తీవ్ర ట్రాఫిక్ పెరిగి వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఉత్పత్తులకు కృషి

(1వ పేజీ తరువాయి)

భరిస్తున్నారని ప్రచారం చేస్తున్నారన్నారు. దేశంలో ఉత్పత్తి చేయబడిన రొయ్యలలో 50 శాతం యూఎస్ఏ కి పంపబడుతుందన్నారు. వారు లేవనెత్తిన ఆరోపణలు కారణంగా ఎగుమతులు తగ్గుముఖం పట్టవచ్చు అన్నారు. ఆక్వా చెరువుల ఇన్సూరెన్స్ పై చర్చించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, జిల్లా ఎంపెడా అధికారి టి.జి మనోజ్ కుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్ వి ఎస్ ప్రసాద్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ యు.మంగపతి రావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కె.వెంకటేశ్వరరావు, ఔషధ తనిఖీ అధికారి అబిద్ అలీ షేక్, జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి, ఏపి ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.వి.రామరాజు, ఏపీ ఆక్వా డీలర్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.కృష్ణంరాజు, ఏపీ ప్రోసెసింగ్ అసోసియేషన్ సెక్రటరీ కె.ఆనంద్, హెచరీష్ ప్రోసింగ్ ప్లాంట్స్ యజమానులు, వివిధ ఆక్వా సంఘాల నాయకులు, ఆక్వా రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రెండు రూపాయలకే చికెన్ బిర్యాని

ట్రాఫిక్ జామ్

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం: స్థానిక ఉషా గ్రాండ్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన అన్ లిమిటెడ్ రెస్టారెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా కేవలం రెండు రూపాయలకే చికెన్ బిర్యాని ఏర్పాటు చేశారు. చిన్న చిన్న పొట్లాలు, నిర్వాహకులు 200 మంది కోసం ఏర్పాటు చేస్తే రెండు వేల మంది వచ్చారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఈ హోటల్ ప్రారంభోత్సవానికి రావడంతో హోటల్ యజమాని మరింత ఆకర్షణీయంగా ఉండేందుకు ఈ పథకం ప్రవేశపెట్టాడు. దీంతో తొక్కిసలాట, ట్రాఫిక్ జామ్‌కావడంతో పట్టణ సీఐ సుబ్రమణ్యం రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే పచ్చమట్ల ధర్మరాజు, తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి), మున్సిపల్ మాజీ చైర్మన్ గొర్రెల శ్రీధర్, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు పరిమి రవికుమార్, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

రామాంజనేయ రాజుకు డాక్టరేట్

విశాలాంధ్ర -భీమవరం: సామర్థ్యం తక్కువ ఉన్న సాయిల్స్‌ను కూడా ట్రీట్మెంట్ చేసి నిర్మాణ రంగంలో ఉపయోగించ వచ్చు నని చేసిన పరిశోధనకుగాను ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.రామాంజనేయరాజు ఎన్ఐటి వరంగల్ డాక్టరేట్ ప్రకటిం చింది. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.మురళీ కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ డాక్టర్ రామాంజనేయ రాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, సివిల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ ఎ సి ఎస్ వి ప్రసాద్, సీనియర్ ప్రొఫెసర్ బి.ఆర్.ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తడి పొడి చెత్త నుండి సంపద సృష్టి

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ లో తడి పొడి చెత్త నుండి వర్మి కంపోస్టు తయారు చేయవచ్చని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. గురువారం పి అంకంపాలెం లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద వర్మ్ షాపును ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధికి వర్మి కంపోస్టు ఎంతగానో ఉపయోగపడు తుందని అన్నారు .గ్రామాలలో వీధులు పరిశుభ్రంగా ఉండాలంటే తడి పొడి చెత్తను వేరు చేసి క్రాప్ మిత్రులకు తెలపాలని అన్నారు. నిర్వాసితులకు కేటాయించిన భూములు ఆక్రమించుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్ర మంలో డిఎల్‌డిఓ రాజు, డిఎల్‌పిఓ రజహుల్ల, ఎంపీడీవో కే మంగతాయారు, సర్పంచ్ బుద్ధ జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఐరన్ మాత్రలు వాడాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కాశిపాడు గ్రామంలోప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గురువారం రాష్ట్రీయ బాల స్వస్త్ కార్యక్రమం లో భాగంగా ఐ ఎఫ్ ఏ (ఐరన్ మాత్రలు) విద్యార్థులకు వేసినట్లు ప్రధానోపాధ్యాయుడు ఏ ఎస్ ఎస్ ఆర్ బి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రతి గురువారం ఆరోగ్య శాఖ వారు అందించే ఐరన్ మాత్ర వేసుకోవడం వలన రక్తహీనత లేకుండా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాల రాజు ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, వీరవేణి, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి తహసీల్దారుగా సుభాని

విశాలాంధ్ర - ముదినేపల్లి : ముదినేపల్లి మండల తహసీల్దారుగా జెవిఎస్ సుభాని ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. చాలాకాలం సచివాలయ ఉద్యోగిగా పనిచేసి ఇటీవల మండవల్లి మండలం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారుగా పనిచేసి బదిలీపై ముదినేపల్లి తహసీల్దారుగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఐ శివకుమార్, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

మిషన్ శక్తి 100 రోజులు కార్యక్రమంపై అవగాహన

విశాలాంధ్ర- పాలకోడేరు: మిషన్ శక్తి "100 రోజులు అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం పాలకోడేరు మండలం శృంగవృక్షం అంగన్వాడి సెంటర్‌లో లబ్ధిదారులకు, మహిళలకు సూపర్వైజర్ పార్వతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు మహిళా చట్టాలు, బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్స్ చట్టం గురించి, బాలికల, మహిళలను అనవసరంగా, అసభ్యకరంగా తాకడం గురించి, లైంగిక వేధింపుల గురించి, స్త్రీల హెల్ప్ లైన్ గురించి ప్రభుత్వంవారు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ల మొదలగు వాటిపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మహిళలను మరింత ప్రోత్స హించేందుకు అందరూ కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

15న అన్న క్యాంటీన్లు

విశాలాంధ్ర -భీమవరం: ఆకలితో ఉన్నవారికి పేదవారికి కడుపునిండా భోజనం పెట్టాలనే తలంపుతో అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తే వాటిని జగన్ ప్రభుత్వం నాశనం చేసిందని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు విమర్శించారు. బుధవారం మార్కెట్, పాత బస్టాండ్, జెపి రోడ్డులోని అన్న క్యాంటీన్లు గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 15న అన్ని చోట్ల అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామని, 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో అన్ని చోట్ల అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదవారి ఆకలిని తీర్చమని, 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్ సిపి జగన్ ప్రభుత్వం హయంలో అన్న క్యాంటీన్లు తొలగించారని అన్నారు. ప్రస్తుతం భీమవరంలోని 3 అన్న క్యాంటీన్లు సుమారు రూ. 25 లక్షలతో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, రూ 5 లకే పేదవారికి భోజనం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ త్రినాథరావు, ఎఎంసి మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపురం తహసీల్దారుగా రాజరాజేశ్వరి బాధ్యతలు

విశాలాంధ్ర-నరసాపురం : నర్సాపురం తహసీల్దారుగా రాజరాజేశ్వరి చార్జ్ తీసుకున్నారు ఆమె గతంలో నర్సాపురం సబ్ కలెక్టర్ ఆఫీస్ లో ఏవోగా బాధ్యతలు నిర్వహించారు. తదుపరి తూర్పుగోదావరి జిల్లా లో విధులు నిర్వహిస్తూ గురువారం నర్సాపురం తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. నూతన తహసీల్దారుకు డిప్యూటీ తహసీల్దారు బెజవాడ సీతారత్నం, సివిల్ సప్లై నాగదేవి, కంప్యూటర్ ఆపరేటర్ చిన్న శ్రీను, రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

అనుమతులు లేకుండా బేరన్లు నిర్మిస్తే కూల్చివేస్తాం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అనుమతులు లేకుండా వర్జీనియా పొగాకు బేరన్లను నిర్మిస్తే వాటిని కూల్చివేస్తామని చైర్మన్ యశ్వంత్ కుమార్ హెచ్చరించారు. గురువారం వర్జీనియా పొగాకు వేలం కేంద్ర భవనంలో నిర్వహించిన రైతు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు పొగాకు క్యూరింగ్ కోసం ఇబ్బడి ముబ్బడిగా అనుమతులు లేకుండా బ్యారెన్లను నిర్మించుకుంటున్నారని ఇది బోర్డు నియమావళికి విరుద్ధం అన్నారు. రైతులకు తుఫాన్ వలన కలిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని వర్జీనియా పొగాకు రైతులను ఆదుకునే ఉద్దేశంతో అదనపు పంట విక్రయంపై అదనపు సుంకం రద్దు చేయడం జరిగింది అని, ఈ విధానం ఇదే చివరిసారి అని భవిష్యత్తులో ఉండబోదు అని చైర్మన్ పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వర్జీనియ రైతులు వచ్చే సంవత్సరం కూడా అదనపు సుంకం ఉండదనుకుంటూ భావిస్తున్నారన్నారు. అదనపు సుంకం రద్దు వల్ల వర్జీనియా పంట

పండించే ప్రతి రైతుకు నలభై వేల రూపాయల నుండి లక్ష రూపాయల వరకు లబ్ధి చేకూరింది అన్నారు. అన్య పదార్థాలు లేని నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేస్తేనే వచ్చే సీజన్లో రైతులకు లబ్ధి చేకూరుతుంది అన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న రైతు సమస్యలను రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది, ఎస్కే సయ్యద్ బాజీ (సైదులు) ముప్పన పల్లి రామచంద్రరావు, అడప సత్తిబాబు తదితరులు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. అదనపు సుంకం రద్దు చేసినందుకు కృతజ్ఞతగా చైర్మన్ ని రైతులంతా శాలువాలతో పూలమాలలతో సత్కరించారు. ఆర్‌ఎం జివిఎల్కే ప్రసాద్, ఏఎస్ గ్రేసీ మార్గరెట్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుండి సంపద సృష్టించే 383 కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

కలెక్టరు చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: అక్టోబర్ రెండవ తేదీ నాటికి జిల్లాలో చెత్త నుండి సంపద సృష్టించే 383 కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మీకోసం సమావేశ మంది రంలో జిల్లాలోని గ్రామ పంచాయతీ పరిధిలో త్రాగునీరు, శానిటేషన్, వీధి యల్ఇడి లైట్స్, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, మండల స్థాయిలో గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు మూడురోజులు శిక్షణ కార్యక్రమాలు, హౌస్ టాక్స్, తదితర 15 అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు చెత్త నుండి సంపద సృష్టించే కేంద్రాలను అక్టోబరు 02 నాటికి జిల్లాలో 383 కేంద్రాలను పూర్తిస్థాయిలో వాడుకంలోనికి తీసుకురావాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 409 గ్రామ పంచాయతీలకు గాను 383 గ్రామపంచాయతీలో చెత్త నుండి సంపద సృష్టించే షెడ్లు ఉన్నాయని అన్నారు. వాటిలో 166 మాత్రమే వినియోగంలో ఉన్నాయని, ఈ నెలాఖరు నాటికి 49 కేంద్రాలను, సెప్టెంబరు 15 వ తేదీ నాటికి 74 కేంద్రాలను, మిగిలినవి సెప్టెంబరు 30వ తేదీ నాటికి వినియోగంలోకి తేవాలని కోరారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

విశాలాంధ్ర - గణపవరం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నేటి సమాజంలో యువత మత్తు పదార్థాలకు బానిసై కొన్ని నేరాలకు పాల్పడుతున్నారని మత్తు పదార్థాలు వ్యతిరేకంగా విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని గణపవరం ఎస్ఐ వేముల

వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం సోషల్ వర్క్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పీహెచ్ఎస్ సంతోష నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం దుష్పరిణామాల గురించి వివరించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ జె విల్సన్ బాబు వైస్ ప్రిన్సిపాల్ పి మధురాజు డాక్టర్ సిహెచ్ చైతన్య బి శ్రీనివాసరావు డాక్టర్ కె స్వరూప రాణి డాక్టర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టాలి

విశాలాంధ్ర -భీమవరం: డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టాల్సిన బాధ్యత యువతపై ఉందని డివిఎన్నార్ విద్యా సంస్థల సెక్రెటరీ కరస్పాండెంట్ గాదిరాజు బాబు పిలుపునిచ్చారు. డివిఎన్నార్ కళాశాలలో మాదకద్రవ్యాలు, ధూమపాన నివారణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి. మోసెస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాదిరాజు బాబు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనై తల్లిదండ్రులను క్షోభ పెట్టొద్దని హెచ్చరించారు. కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురాజు మాట్లాడుతూ విద్యార్థులు మహనీయుల ఆశలను, ఆశయాలను నెరవేర్చాలని, మంచి నడవడిక కలిగి దేశానికి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రఘురాం, కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పి.రామకృష్ణంరాజు, ఎన్ఎస్ఎస్ అధికారులు చెల్లబోయిన రంగారావు, కె.సోమయ్య, అనిల్, బాలా, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు శిక్షణ

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్టియుకె అలూమ్ని ఆడిటోరియంలో మొదటి సంవత్సరం బీటెక్, మెడికల్ విద్యార్థులకు "శ్రేష్ఠత (ఎక్సలెన్స్) కోసం లక్ష్యాన్ని నిర్దేశించడం-పరివర్తన చెందేందుకు శిక్షణ" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథిగా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి శిక్షణా సంస్థ మాజీ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ అకాడమీ మాజీ డైరెక్టర్ జనరల్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి ఎం. రామప్రసాద్, ఐఎఫ్ఎస్ విచ్చేయగా గౌరవ అతిథులుగా రెక్టార్ ప్రొ. కెవి రమణ, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ. ఎన్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. కె మీరా సాహెబ్‌లు విచ్చేశారు. సదస్సుకు యుసిఇకె పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె. కృష్ణభాస్కర్, కో-ఆర్డినేటర్‌లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రొ కెవిఎస్‌జి.మురళీకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పరివర్తన చెందేందుకు శిక్షణ పొందాలన్నారు. విద్యార్థులకు జ్ఞానం

ద్వారా సమాచారం, శిక్షణ, పరివర్తన చెందేందుకు ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. విశిష్ట అతిథి ఎం. రామప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే సంతోషంగా జీవించవచ్చునన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ, రెక్టార్ ప్రొ కెవి రమణ, అధికారులు ఎం.రామప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ కెవి రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్, ఓఎస్‌డి ప్రొ డి కోటేశ్వరరావు, డైరెక్టర్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ మరియు మెడికల్ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నిండు కుండలా చెరువులు

విశాలాంధ్ర - గండేపల్లి : గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు గండేపల్లి మండలంలోని చెరువులు నిండు కుండల్లా దర్శనమిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి గండేపల్లి మండలం జడ్ రాగంపేట గ్రామంలోని బావి చెట్టు చెరువు నిండి కలింగుల మీదుగా గ్రామంలోకి ప్రవేశించింది. దీనితో సమాచారం

అందుకున్న తెదేపా నాయకుడు జెడ్ రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు హుటా హుటిన గ్రామంలోని కాలువల్లో అడ్డుకున్న చెత్తను ప్రొక్లెయిన్‌తో తీయించి, గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా వర్షలకు నీలాద్రిరావుపేట గ్రామంలోని రంభద్రయ్య చెరువు, సీతారాంపురం గ్రామంలోని చెరువులు నిండి ఇలా వస్తాయని దీనిలో భాగంగా గ్రామంలో చెరువు నిండి గ్రామంలో ఉన్న పంట కాలువ మీదుగా వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, రాంబాబు, సాయి, ప్రసాద్ తదితర గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని 12 గ్రామాలు, నగర పంచాయతీలోని 40 పాఠశాలలకు జరిగిన విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈఓ-1 బి అబ్బాయి తెలిపారు. ఏలేశ్వరం హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్‌గా కర్రోతు సత్యనారాయణ (గాంధీ), వైస్ ఛైర్పర్సన్‌గా కటకం సూర్య కుమారి, గర్ల్స్ హైస్కూల్ చైర్మన్‌గా పసుపులేటి శ్రీను, వైస్

ఛైర్పర్సన్‌గా జామి గోవిందమ్మతో పాటు మరో 38 ఛైర్మన్లు, 38 వైస్ ఛైర్మన్లు ఎన్నికయ్యారని తెలిపారు. అనంతరం ఓటమి మద్దతుతో గెలుపొందిన విద్యా కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను స్థానిక కూటమి నాయకులు, కౌన్సిలర్లు మూదీ నారాయణస్వామి, బొదిరెడ్డి గోపాలకృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడం జరుగుతుందని వారు తెలిపారు. అలాగే పాఠశాలల అభివృద్ధికి విద్యా కమిటీ ఛైర్మన్‌లు, వైస్ ఛైర్మన్లు కృషి చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోణాల వెంకటరమణ, ఎండగుండి నాగబాబు, కూటమి నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్: రాష్ట్రంలో నానాటికి పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భీమవరం ఒకటవ పట్టణ సిఐ నాగరాజు అన్నారు. గురువారం ఒకటవ

పట్టణ పోలీస్ స్టేషన్ లో శ్రీవిజ్ఞానవేదిక రూపొందిన ప్లకార్డులు, బ్యానర్ల ప్రచార కార్యక్రమాన్ని సిఐ ప్రారంభించి మాట్లాడారు. విద్యావంతులు, ఉద్యోగస్తులు ఈ సైబర్ నేరాలకు గురవుతున్నారని, అపరిచితుల దగ్గర ఫోన్లు రీసివ్ చేసుకోకూడదని, ఓటీపీ నెంబర్లు, బ్యాంక్ అకౌంట్ వివరాలను ఎవరికి ఇవ్వకూడదని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ మాట్లాడుతూ ప్రజలు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలంటూ అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని,పట్టణంలోని ప్రధాన కూడలిలో బ్యానర్లు, ప్లకార్డ్స్ ప్రదర్శన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

బత్తుల వెంకటేశ్వరరావు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోట

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్

విశాలాంధ్ర - ఏలూరు : సిపిఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వరరావు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి)ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే. విగ్నేష్,భజంత్రీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. అఖిలభారత యువజన సమాఖ్య నూజివీడు ఏరియా కార్యదర్శిగా పనిచేసి, అంచలంచలుగా ఎన్నో ప్రజా పోరాటాలు చేసి, భూస్వామ్య పోరాటంలో నాలుగు సంవత్సరాలు జైలు జీవితం గడిపి, జైలు నుండి విడుదల అయిన అనంతరం పూర్తిస్థాయి కార్యకర్తగా పనిచేశారని కొనియాడారు. ఎర్ర జెండా ముద్దుబిడ్డగా, నూజివీడు నియోజకవర్గం నాయకుడిగా ఎదిగిన బత్తుల వెంకటేశ్వరరావు ఆకస్మికంగా మృతి చెందడం విచారకరం అన్నారు. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయండి : ఎంపీ పుట్టా

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు: 1లక్ష 20 వేల మంది పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని, లక్ష మంది పామాయిల్ రైతులకు ఏలూరు జిల్లాలో ఇంక్యుబేషన్ సెంటర్ నెలకొల్పాలని, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గురువారం పార్లమెంటులో ప్రశ్నోత్తర సమయంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్రంలో 26 జిల్లాలకు గాను 7 ఇంక్యుబేషన్ కేంద్రాలు మాత్రమే ఉన్నాయని, ఏలూరు జిల్లాలో లక్ష మంది పైగా పామాయిల్ రైతులు ఉన్నారని, వారి సౌకర్యం, పామాయిల్ రైతుల లబ్ధి కోసం ఏలూరు జిల్లాలో వ్యవసాయ పరిశోధన, ప్రాసెసింగ్, ఉత్పత్తి కేంద్రం (ఇంక్యుబేషన్ సెంటర్) ఏర్పాటు చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర మంత్రి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి జితిన్ రామ్ మాన్ జీ ని కోరడం కోరారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు ప్రస్తావిస్తూ మాట్లాడుతూ 1,20,000 మంది పోలవరం నిర్వాసితులు ఉన్నారని వారికోసం నూతన ఉపాధి అవకాశాలు, నూతన సంస్కృతి, నూతన జీవన విధానం కోసం తగిన ఏర్పాట్లు చేయాలని ఎంపీ కోరారు.దీనిపై సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి జితిన్ రామ్ మాన్ జీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రశ్నలకు సమాధానమిస్తూ ఏలూరు జిల్లాలో నూతనంగా ఇంక్యుబేటర్ సెంటర్ ఏర్పాటును పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించడం జరిగింది. పోలవరం నిర్వాసితులకు సరియైన లబ్ది చేకూర్చటానికి ప్రధాని నరేంద్ర మోడి సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సమాధానం ఇచ్చారు.

విద్యుత్ సిబ్బంది కష్టాలు

- ఎదురవుతున్న ఇబ్బందులతో సిబ్బందిలో ఆందోళన
- వినియోగదారులపై ప్రభావం
- అధికారుల పర్యవేక్షణ కొరవడుతుందనే విమర్శలు

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెం విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి అనేక అవాంతరాలు ఎదురవుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల వ్యవధిలో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి జరిగిన అనూహ్య సంఘటనలతో వీరు బెంబేలెత్తుతున్నారు. ఈ ఏడాది జూన్ చివరి నుంచి ఈనెలలో ఇప్పటివరకు పలు సంఘటనలు చోటు చేసు కున్నాయి. సబ్ స్టేషన్లో పని చేస్తున్న సబ్ఇంజనీర్ అప్పారావుకు ప్రమాదంలో కాలు విరిగింది. ఆ తరువాత షిఫ్ట్ ఆపరేటర్ రమేష్ ఆకస్మికంగా మృతి చెందాడు. ఇక్కడ పనిచేస్తున్న జూనియర్ లైన్‌మెన్ సత్తి బాబుకు చెందిన 36రోజుల వయసున్న బాబును ఇతని తోడల్లుడు హత్య చేసిన కిరాతక సంఘటన జూలై15న జరిగింది. ఈ సంఘటన అనంతరం మరో జూనియర్ లైన్‌మెన్ శ్రీనుకు విద్యుత్ షాక్ వల్ల కాలుకు బలమైన గాయమైంది. ఈ సంఘటన అనంతరం లైన్‌మెన్ రాజుకు రోడ్డు ప్రమాదం జరగడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సిబ్బందికి ఇటువంటి పరిస్థితులు తలెత్తడంతో పనిచేసే వారే ఉండటం లేదు. ఒక్కరు మాత్రమే డ్యూటీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల డ్యూటీలో ఉన్న ఒక్క ఉద్యోగిపై పనిభారం పడుతున్నది. ధర్మాజీగూడెం పంచాయతీలో నాలుగు వేల ఇళ్ల కనెక్షన్లు, 400 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ఎనిమిది పరిశ్రమలకు విద్యుత్తు సరఫరా చేయాల్సి ఉంది. ఒక లైన్‌మెన్, ఇద్దరు జూనియర్ లైన్‌మెన్లు పనిచేసినా ఏదో సమస్య వస్తూనే ఉంటుంది. .గ్రామంలో విద్యుత్ సరఫరా కోసం 320ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేశారు. నిత్యం ఏదో ఒక చోట విద్యుత్ సరఫరాలో అంతరాయం వాటిల్లుతుంది. దీన్ని సరి చేయటానికి సమయం పడుతుంది. దీనివల్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే గాక సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్న సంఘటనలు జరుగుతున్నాయి. ముగ్గురు లైన్‌మెన్లు పనిచేస్తేనే పనిచేయటానికి కష్టంగా ఉన్న పరిస్థితుల్లో ఒక్కరే ఉండి పనిచేయ టం వల్ల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు. ఉన్న లైన్‌మెన్లు గాక మరో ఇద్దరిని నియమిస్తే పరిస్థితులు అనుకూలంగా ఉంటాయని సిబ్బంది అంటున్నారు. గ్రామంలో తరచూ వచ్చే విద్యుత్తు అంతరాయాన్ని నివారించడానికి సమయం పడుతుంది. కనీసం ట్రాన్స్ ఫార్మర్లలో ఫ్యూజు వేయాలన్నా గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. సిబ్బంది సంగతి పక్కన పెడితే లైన్ ఇన్‌స్పెక్టర్‌పై పనిభారం అధికమవుతున్నదని వినియోగదారులే అంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఒక అధికారి హోదాలో ఉన్న ఉద్యోగిపై విమర్శలు కూడా ఉన్నాయి. సబ్ స్టేషన్ లో ఉన్న పరిస్థితులను చక్కదిద్దటంలో ఉన్నతాధికారుల జోక్యం అవసరమని వినియోగదారులు కోరుతున్నారు. వరుస సంఘటన లతో సిబ్బందికి జరుగుతున్న నష్టాలు, కష్టాలతో ఇక్కడ ఉన్న కార్యాలయానికి వాస్తు దోషం ఉందనే అనుమానాలు సిబ్బంది వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పని చేసే వారంతా నిత్యం భయంతో గడుపు తున్నారు. ఈ పరిస్థితులన్నింటిని చక్కదిద్దవలసిన అవసరం ఉన్నతాధికారులపై ఉందని వినియోగదారులు కోరుతున్నారు.

విలీన మండలాల ప్రజల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర- ఏలూరు: రాష్ట్ర విభజన ద్వారా విలీన మండలాలలో నివశిస్తున్న విద్యావంతులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన కారణంగా విలీనం కాబడిన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు, చదువుకుంటున్న విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యార్థులు విద్యాభ్యాసం రెండు రాష్ట్రాలలో కొనసాగినందున వారు ప్రస్తుతం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యోగ నియామక ప్రక్రియలలో దరఖాస్తులు నమోదు చేసుకునే ప్రక్రియలో అభ్యర్థులు ఒకటి నుండి పదవ తరగతి వరకు ఉమ్మడి రాష్ట్రంలో విద్యాభ్యాసం చేసినందున నెట్లో నమోదు కావడం లేదన్నారు. విభజన తరువాత తెలంగాణ రాష్ట్రంలో చదువులు కొనసాగటం వలన ప్రభుత్వ నియామకాలలో ప్రభుత్వ వెబ్‌సైట్లలో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, దీని ద్వారా అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితులలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆధార్ కార్డులతో సమస్యలు, రైతులకు పట్టాదారు పాసుపుస్తకముల సమస్యలు, వ్యాపారులు అంతర్ రాష్ట్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని విలీన మండలాల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలి



విశాలాంధ్ర -నూజివీడు : నూజివీడు మండ లం పల్లెర్లమూడి గ్రామంలో అత్యాచారానికి గురైన 4 సంవత్సరాల బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ఎస్.టి. కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. పల్లెర్లమూడిలో బాలిక ఇంటికి గురువారం వెళ్లి బాలిక కుటుం బాన్ని శంకర్ నాయక్ పరామర్శించారు. జరిగిన సంఘటనపై బాలిక తల్లితండ్రులను శంకర్ నాయక్ ఓదార్చారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ జరిగిన సంఘటన దురదృష్టకరమైనదన్నారు. నాగరిక సమయంలో అభం శుభం తెలియని బాలికపై అఘాయిత్య ఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. తప్పుచేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి, కేసు విచారణను వేగవంతం చేస్తున్న పోలీసు, జిల్లా యంత్రాంగాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.సంఘటనను ఫోక్సో చట్ట ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని, అఘాయిత్యా నికి గురైన బాలిక కుటుంబానికి రూ. 5 లక్షల వరకు పరిహారం అందించాలన్నారు. కోటరామ చంద్రాపురం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి జి. శ్రీనుకుమార్, ఇన్‌చార్జి ఆర్డీఓ భాస్కర్, ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బారావు, సీడీపీ ఓ ఎస్.వై. నూరాని, వ్యవసాయాధికారి చాముండేశ్వరి, గొల్లపల్లి పి హెచ్ సి వైద్యాధికారి నెజ్మా, రూరల్ సిఐ రామకృష్ణ, పోలీసు, రెవిన్యూ సిబ్బంది, ప్రభృతులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - పాలకొల్లు : ఛాంబర్స్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. జి.ఎస్.టి డిపార్ట్మెంట్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ నరసాపురం ఆధ్వర్యంలో, ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరాన్ని కళాశాల చైర్మన్ కె.వి.ఆర్ నరసింహారావు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. గౌరవ అతిథిగా కలిదిండి రామరాజు పాల్గొని విద్యార్థులకు డ్రింక్స్, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కెవి నరసింహారావు మాట్లాడుతూ రక్తదానం అనేది ఒక సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు రోటరీ అధ్యక్షులు చవాకుల నరేష్, కళాశాల ప్రిన్సిపాల్ డా. దిరిశాల వెంకటేశ్వరరావు, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ కె.రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్యం ఎన్నికలు

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: ఈదర ప్రధాన ప్రాథమిక పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. చైర్మన్‌గా వడపర్తి రమేష్, వైస్ చైర్మన్‌గా గుర్రం నాగలక్ష్మి ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం జరిగిన తొలి సమావేశంలో స్కూల్ ఆవాస ప్రాంతంలోని బడిఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని చైర్మన్ రమేష్ తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నాణ్యతగా విద్యార్థులకు అందించాలని వైస్ చైర్మన్ నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాలరావు మాట్లాడుతూ పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఎం. నిర్మల దేవి, పామర్తి అనసూర్య, గరిశేపల్లి పూజిత,రంగమ్మ పాల్గొన్నారు.

శ్రీ విష్ణు ఇంజనీరింగ్ కాలేజీకి సెల్ఫ్ లాండ్రీ సర్వీస్‌ను విస్తరించిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్

విశాలాంధ్ర-భీమవరం: విద్యార్థి జీవితాన్ని మెరుగుపరిచే తమ మిషన్ కొనసాగింపులో, భారతదేశపు ప్రీమియర్ వినియోగదారు డ్యూరబుల్ బ్రాండ్ ఎల్‌జీ ఎలక్ట్రోనిక్స్, తమ వినూత్నమైన సెల్ఫ్-లాండ్రీ సర్వీస్ ను శ్రీ విష్ణు ఇంజనీరింగ్ కాలేజీ కోసం విడుదల చేసింది. దీనిలో భాగంగా 5 మెషీన్లు ఇన్ స్టాల్ చేసింది. గల్ గోటియాస్ కాలేజీ, గల్ గోటియాస్ యూనివర్శిటీ, బిట్సమ్, ఎన్ఐటి గోవా మొదలైన ప్రాంతాల్లో విజయవంతంగా చేసిన పరిచయంపై ఈ విస్తరణను కొనసాగించింది. కాలేజీలో కొత్త సెల్ఫ్-లాండ్రీ సదుపాయం సుమారు 5300 మంది విద్యార్థులకు సేవలు అందిస్తుంది, 'లాండ్రీ క్రూ' యాప్ ద్వారా ఎల్జీ కమర్షియల్ వాషింగ్ మెషీన్స్ ను ఉపయోగించే సౌకర్యాన్ని అందిస్తుంది. మెషీన్ రిజర్వేషన్స్, ఆపరేషన్స్, మరియు స్వయంచాలిత చెల్లింపులను ప్రారంభించడం ద్వారా ఈ యాప్ లాండ్రీ ప్రక్రియను అమలులోకి తెస్తుంది, విద్యార్థులకు ఇబ్బందులు లేని అనుభవం కలగచేస్తుంది. "విద్యార్థులకు ఆచరణసాధ్యమైన వినూత్నమైన పరిష్కారాలను తీసుకురావడం, తమ సమయాన్ని మెరుగ్గా నిర్వహించడంలో వారికి సహాయపడటం మా లక్ష్యం," అని ఎల్జి ఎలక్ట్రానిక్స్ ఇండియా ఎండి హొంగ్ జు జియాన్ ఈ సందర్భంగా అన్నారు.

అర్బన్ ఫారెస్ట్ ప్లాంటేషన్ నిర్వహణకు స్థల పరిశీలన

విశాలాంధ్ర - కాకినాడ : అర్బన్ ఫారెస్ట్ ప్లాంటేషన్ కార్యక్రమ నిర్వహణకు కాకినాడలోని పలు ప్రాంతాలను నగర పాలక కమిషనర్ భావన ఐఏఎస్ గురువారం పరిశీలించారు. ఈనెల 12 నుంచి 15వ తేదీల మధ్య కాకినాడలో నిర్వహించ బోయే అర్బన్ ప్లాంటేషన్ కార్యక్రమానికి సీఎం, డిప్యూటీ సీఎం హాజరుకానున్న నేపథ్యంలో స్థల పరిశీలన చేశారు. దీనిలో భాగంగా కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్ ఆవరణ, ఆర్ఆర్ నగర్లోని పార్క్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల గ్రౌండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆయా మైదానాల వివరాలు అడిగి తెలుసుకుని, టౌన్ ప్లానింగ్, ఉద్యానవన శాఖ విభాగ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ హరిదాసు, ఎంహెచ్ఓ పృథ్వీ చరణ్, ఏడీహెచ్ సిరిల్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పై క్షేత్రస్థాయి పరిశీలన

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించడమే కాదు క్షేత్రస్థాయిలో ఆ సమస్య తీవ్రతను కూడా తెలుసుకుంటూ తనదైన శైలిలో స్పందిస్తున్నారు. కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్. కాకినాడ నగరం డెయిరీ ఫారం సెంటర్ సమీపంలోని పావురాల తూము నుంచి పల్లంరాజు నగర్ ఒకటో వీధికి వెళ్లే దారిలో రాకపోకలు పునరుద్ధరించాలని ఇటీవల స్థానికులు కొందరు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అర్జీ అందజేశారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని గురువారం నగరపాలక కమిషనర్ భావన ఐఏఎస్ పరిశీలించారు. ఆ రహదారిలో నెలకొన్న సమస్యలను ఆమె స్వయంగా గమనించారు. టౌన్ ప్లానింగ్ డీసీపీ హరిదాసును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జలదిగ్బంధంలో పారిశుద్ధ్య కార్మికుల కాలనీ

విశాలాంధ్ర - కరప : ఎడతెరిపిలేని వర్షాలకు కరపలోని పారిశుద్ధ్య కార్మికుల కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. రోడ్లు మునిగిపోయి మోకాలు లోతు నీటిలో నుండి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని పారిశుద్ధ్య కార్మికుడు బంగారు రాజబాబు తెలిపారు. నీటిని పోయే మార్గం పంచాయతీ యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకోవాలని రాజబాబు కోరాడు. అదేవిధంగా కరప మండల పరిషత్ కార్యాలయం గతకొన్నాళ్ళుగా చినుకు పడితే జలమైన ఉద్యోగుల కార్యకలాపాలకు ఇబ్బందిగా మారుతుంది. దీని పరిష్కార మార్గాన్ని నేటికీ అధికారులు చొరవ చూపకపోవడం ఒక ఇంత ఆశ్చర్యాన్ని గురిచేస్తుందని పలువురు స్థానికులు గుప్పిస్తున్నారు.

భీమనపల్లి హైస్కూల్ చైర్మన్‌గా గుర్లింక చిన్న

విశాలాంధ్ర - అమలాపురం, ఉప్పలగుప్తం : ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి ఎస్ఎస్ఆర్ జెడ్పి హైస్కూల్ చైర్మన్‌గా గుర్లింక చిన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జడ్పీ హైస్కూల్ యాజమాన్యం తెలిపింది. మాజీ జెడ్పిటిసి దేశం శెట్టి లక్ష్మీనారాయణ తదితరులు అభినందించారు. కూనవరం గ్రామంలో మూడు పాఠశాలలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వ హించారు. కూనవరం ఎంపీపీ యూపీ స్కూల్ చైర్మన్ మోటుపల్లి సుభాషిని, వైస్ చైర్మన్ బొక్కా ఉమామహేశ్వరరావు, కూనవరం వన్ ఎంపీపీపీ స్కూల్ చైర్మన్ పండు వీరవాణి, వైస్ చైర్మన్ బూసి లక్ష్మీ దుర్గ, కూనవరం టు ఎంపీపీపీ స్కూల్ చైర్మన్ వెయ్యల శంకరుడు, వైస్ చైర్మన్ అయితాబత్తుల జ్యోతి పై సభ్యులను చైర్మన్ వైస్ చైర్మన్‌గా ఎన్నుకొన్నారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ పండు వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ సభ్యులు రామాంజనేయులు, నాగిరెడ్డి రాంబాబు, సుందరనీడి రాజబాబు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్ఎస్‌వి రామకృష్ణారావు, కే నవీన్ కుమార్, ఆర్‌పిఎల్ ప్రసన్నకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

విశాలాంధ్ర - గోపాలపురం : గోపాలపురం నియోజకవర్గం పరిధిలోని జాతీయ, రాష్ట్ర రహదారుల అభివృద్ధికి సహకరించాలని కేంద్రమంత్రి నితిన్ ఘట్కారిని ఢిల్లీలో రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసి ఎంపీ పురందరేశ్వరి ఆధ్వర్యంలో కేంద్ర రహదారుల మరియు భవనాల శాఖ మంత్రి నితిన్ గట్కారిని ఢిల్లీలో కలిసి నివేదికను అందజేసినట్లు తెలిపారు. ముఖ్యంగా గుండుగొలను - కొవ్వూరు జాతీయ రహదారితో పాటు, దుద్దుకూరు లక్ష్మీపురం పల్లంట్ల కురుకూరు త్యాజంపూడి ఎర్నగూడెం వరకు అదేవిధంగా ధూబచెర్ల నుంచి జి. కొత్తపల్లి మీదుగా గ్రీన్ ఫీల్డ్ హైవే వరకు దేవరపల్లి నుండి ప్రారంభమవుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పరిసర ప్రాంతాల ప్రజలకు ఉన్న సమస్యలను వివరించారు. జీలుగుమిల్లి నుంచి గోపాలపురం మండలంలోని దొండపూడి మీదుగా కొవ్వూరు వరకు నిర్మించే జాతీయ రహదారి పనులను వేగవంతం చేయాలని మంత్రిని కోరామన్నారు. ఆయా గ్రామాలను అనుసంధానం చేసే ప్రధాన రహదారులను విస్తరించి శిథిలమైన రహదారులను పునర్ నిర్మించడానికి నిధులు మంజూరు చేయవలసిందిగా మంత్రిని కోరామని తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే మద్దిపాటి అన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే నల్లమిల్లి

విశాలాంధ్ర - పెదపూడి : ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా తులసి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు పరస్పర సహకారంతో పని చేయాలన్నారు. ప్రోటోకాల్ తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ముందుగా నియోజకవర్గం సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు ఆధ్వర్యంలో సర్పంచులు ఎమ్మెల్యేకు గజమాల వేసి సత్కరించారు. అనంతరం వివిధ శాఖాధికారులు వారి ప్రగతిని వివరించారు. మొదటిగా వ్యవసాయ. విద్యాశాఖ. రెవెన్యూ, ఇరిగేషన్, ఐసీడీఎస్, డ్రైనేజీ, పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం మొదలగు శాఖలు వారి పనులు, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఎంపీడీఓ ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ కర్రెడ్ల వెంకన్నబాబు, ద్వారంపూడి పద్మారెడ్డి, సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానం

విశాలాంధ్ర - కొవ్వూరు : ప్రతి ఒక్కరు రక్త దానం చేస్తే ముగ్గురి ప్రాణదానం చేసిన వారం అవుతామని, 18 సంవత్సరములు పైన వయస్సు కలిగి రక్త దానముపై విద్యార్థులు భయ పడకుండా దానం చేయడానికి కళాశాలలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ఎన్‌వి సుబ్బారావు అన్నారు. తలసీమియా వ్యాధిన బారిన పడిన వారి సహాయార్థం Goods and Services Tax డిపార్ట్ మెంట్ వస్తువులు, సేవల పన్ను) విభాగము వారు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో స్థానిక కొవ్వూరు కళాశాలలో రక్తదాన శిబిరాన్ని సూపరింటెండెంట్ రవిచంద్ర మూర్తి కలిసి అయన ప్రారంభించారు. ఈ సందర్భముగా సూపరింటెండెంట్ పాల్గొని చంద్రమూర్తి మాట్లాడారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

ముగిసిన ఎస్ఎంసి ఎన్నికలు

విశాలాంధ్ర - రాజానగరం : పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుతో పాటు పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తామని పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసి) చైర్మన్ దాకరపు వెంకన్నబాబు అన్నారు. మండలంలోని చక్రద్వారబంధం గ్రామంలోని హై స్కూల్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివిఎస్ఎస్ సీతారామయ్య అధ్యక్షతన గురువారం జరిగిన ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.ఎన్నికల్లో మొత్తం 24 మంది సభ్యులు పోటీ చేయగా వారిలో 20 మందికి విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నిక చేసుకున్నారు. వీరిలో చైర్మన్ దాకరపు వెంకన్న బాబు, వైస్ చైర్మన్ పితాని తలుపులమ్మ, సభ్యులుగా సోడసాని త్రిమూర్తులు, పేపకాయలు నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది సత్తిరాజు, మల్లికా,గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి మంత్రి దుర్గేష్ శంకుస్థాపనలు

విశాలాంధ్ర - పెరవలి : రాష్ట్ర ప్రజల అవసరాలను గుర్తించి రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్నివిధాలా పాటుపడుతుందని మంత్రి దుర్గేష్ అన్నారు. మండలంలోని నడుపల్లి కానూరు, కానూరు అగ్రహారం తీపర్రు గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ రహదారులు ఏర్పాటు కోసం నియోజక వర్గంలో కొట్లాది రూపాయలు వెచ్చించి పెద్ద ఎత్తున పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమాలలో స్థానిక సర్పంచ్‌లు నాయకులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి రేషన్ డీలర్ల పాలాభిషేకం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రత్తిపాడు లైన్స్ కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం ప్రత్తిపాడు మండల రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో రేషన్ డీలర్లను కొనసాగిస్తూ పాత పద్ధతిలో ప్రజా పంపిణీ వ్యవస్థను పునరుద్ధరించడానికి సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయించడం పట్ల కృతజ్ఞతగా చంద్రబాబు చిత్రపటానికి రేషన్ డీలర్లు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల మండల అధ్యక్షులు ఏపూరి తిరుపతయ్య, గంటా రాంబాబు, కాట్నం రాజా, తటవర్తి సందీప్, సిద్దపరెడ్డి నాగభూషణం, గొర్ల వీర సాంబమూర్తి, కే సత్యనారాయణ, గంగరాజు, పెద్దిరెడ్డి చక్రం, ఏళ్ల నానాజీ, చింతల గంగాధర్, చంద్రాడ రాజు, బి సాయి సత్యనారాయణ, షేక్ బాబ్జి, నామ సాని సీత, కే వీరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

మంత్రిని కోరిన న్యాయవాది సుధాకర్

విశాలాంధ్ర - పెరవలి : కానూరు గ్రామంలోని జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గురువారం కానూరు గ్రామంలో మంత్రి దుర్గేష్‌ను కానూరు గ్రామానికి చెందిన న్యాయవాది వెన్నపు సుధాకర్ కలసి వినతి పత్రం అందజేశారు. కానూరు గ్రామంలో 2021వ సంవత్సరంలో లబ్ధిదారులకు ఇళ్లస్థలాల పంపిణీ చేశారు. నేటికీ అక్కడ కనీస అవసరాలు కల్పించక పోవడం వలన అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు ఇబ్బందులు పాడాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. గతంలో అధికారులకు నాయకులకు తెలియజేసినా నేటి వరకు ఫలితం లేదని, ఇప్పటికైనా అక్కడ మౌలిక వసతుల కల్పన కోసం చర్యలు తీసుకోవాలని సుధాకర్ వినతి ద్వారా మంత్రిని కోరినట్లు విలేఖరులకు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

పాఠశాలల్లో మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని అన్ని గ్రామాల మండల పరిషత్ హైస్కూల్స్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో భాగంగా జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా ఏనుగు పద్మావతి, వైస్ చైర్మన్‌గా దేవర శ్రీనివాసుతో పాటు 13 మంది సభ్యులు ఎన్నికయ్యారు. మండలంలోని రామవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్‌గా అడబాల పకీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. జగ్గంపేట హైస్కూల్లో ఎస్ఐ బలరామ్, హెచ్ఎం టివి ఎస్ రంగారావు, పంచాయితీ కార్యదర్శి రాజన్న రాజు, ఆయా గ్రామాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ ఆశయ సాధనలో నడుచుకోవాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : యువత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ ఆశయ సాధనలో నడుచుకోవాని వైసీపీ పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని ఆర్బికొత్తూరు గ్రామంలో గురువారం అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్ గోలి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, జగజ్జీవన్ రాము్ల సమాజానికి అందజేసిన సేవలు ఎనలేనివన్నారు. అటువంటి మహనీయులు అడుగుజాడల్లో యువత నడుచుకోవాలన్నారు. అనంతరం రెండు విగ్రహాలను ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మినారాయణ, ఊబా జాన్మెజెస్, యుంద్రు సత్తిబాబు, గోలి సూర్యన్నారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం దిశగా చర్యలు

విశాలాంధ్ర - పెదపూడి, అనపర్తి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మండలంలోని అధికారులతో పలుసమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యే సమస్యల పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కాట్రేనికోన హైస్కూల్ కమిటీ చైర్మన్ ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన జిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎఎంసి) చైర్మన్ ఎన్నిక గురువారం హైస్కూల్ హెచ్ఎం అధ్యక్షతన నిర్వహించారు. చైర్మన్‌గా లంకే మావుళ్ళ స్వామి (బుచ్చిబాబు), వైస్ చైర్మన్‌గా రాగుర్తి పద్మ సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 24 మంది కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకోన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, మోకా అప్పాజీ, మాదే యోగేశ్వరి, విత్తనాల బుజ్జి, వాసంశెట్టి రాజేశ్వరరావు, రేవు రమేష్, జనసేన నాయకులు బాల ప్రసాద్, శ్రీనివాస్, నేలపాటి చెంచలరావు, చంద్రరావు, బొక్కాచిన్న, సూరిబాబు, షేక్ రబ్బాని, కరీం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు, ప్రజాసమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే అశోక్ గళం

విశాలాంధ్ర - యానాం : అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ యానాంలో ఉన్న అనేక అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై గురువారం ప్రస్తావించారు. ముఖ్యంగా ఆరోగ్యం శాఖ యానాం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో గత ఎన్నో సంవత్సరాలుగా కనీస మౌలిక సదుపాయాలు ప్రజలకి అందుబాటులో లేక ప్రవేటు క్లినిక్ ద్వారా చేసుకోవడం జరుగుతుంది. వైద్యులు నాణ్యమైన వైద్యం అందించడం లేదని శాశ్వత వైద్యులు నియమించి మెరుగైన వైద్యం పేద ప్రజ లకి అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆది ద్రావిడ సంక్షేమ శాఖ యానంలో నివసిస్తున్న దళితులకు 1996లో సంభవించిన భారీ తూఫాన్ వల్ల పక్కా గృహ నిర్మాణ నిమిత్తం 35 వేలు రూపాయలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఆ గృహాలు అన్నీ కూడా శిథిలమై ఉంటడంతో పేద దళిత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ బడ్జెట్‌లో కనీసం దానిపై ప్రస్తావించక పోవడం చాలా బాధాకరంగా ఉందనీ తక్షణమే ప్రభుత్వం దీనిపై స్పందించి దళితులుకి 5 లక్షలు రూపాయలు గృహ నిర్మాణ రుణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకి ఇల్ల పట్టాలు యానాం చాలా మందికి ఇల్ల స్థలాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని పేదలుకి ఇల్ల స్థలాలు మంజూరు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఇప్పటికే ఇల్లు నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్న వారికి కనీసం పట్టాలు మంజూరు చేయాలనీ కోరారు. సిఎం రిలీఫ్ ఫండ్ యానాంలో ఉన్నా ప్రజలకి వ్యాప్తంగా సిఎం రిలీఫ్ ఫండ్ కోసం అనేక మంది నమోదు చేసుకోవడం జరిగిందని ఇప్పటి వరకు అనేక దరఖాస్తు సమర్పించడం జరిగింది కానీ ఇప్పటి వరకు వాటిపై ముఖ్య మంత్రి ఎన్ రంగస్వామి స్పందించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. ఆయుస్మాన్ భారత్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ పూర్తి స్థాయిలో పేదలకి అందుబాటులో రావడంలేదని ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాలి కోరారు. లేకపోతె సామాన్య ప్రజలు ఆసుపత్రి ఖర్చులు భరించలేని పరిస్థితి ఉంది అని ఆయన తెలిపారు. ప్రజాపనుల శాఖ ద్వారా ఎలాంటి పనులు కూడా ముందుకు సాగడంతలేదని, గత 2022 సంవత్సరంలో యానంలో సంభవించిన భారీ వరదలుకి రోడ్లు మరియు కల్వర్టు పనులు ఇంత వరుకు కూడా మరమత్తులు చేపట్టలేదని, అదేవిధంగా అనేక అభివృద్ధి పనులుకి శ్రీకారం చుట్టిన కానీ పనులు ప్రారంభిచకపోవడంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రభుత్వం స్పందించి రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. యానాంలో ప్రతి సంవత్సరం సంభవిస్తున్న వరదలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా రక్షణ గోడ నిర్మించాలని ప్రభుత్వం హామీ ఇచ్చిన కానీ ఇంత వరుకు ఎలాంటి పనులు జరగపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గత 30 యేళ్లుగా ప్రజా పనుల శాఖలో ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్న యువతకి కొన్ని రోజుల క్రితం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో విద్య అర్హతతో పాటు కనీస వయసు 30 ఏళ్లు ఇవ్వడం కొంత మంది యువతకి విద్య అర్హత ఉండి కూడా వయసు ఎక్కువ ఉండటం వల్ల వారికి కనీసం రెండు సంవత్సరాలు అవకాశం ఇవ్వాలని కోరారు.

జీవితంలో వ్యాయామం భాగం కావాలి

విశాలాంధ్ర - కాకినాడ : ప్రస్తుత ఆధునిక కాలంలో ప్రతిఒక్కరూ తమ జీవితంలో వ్యాయామం ఒక భాగంగా చేసుకుని, రోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ లావణ్య కుమారి అన్నారు. జాతీయ ఎముకలు వ్యాధుల నివారణా వారోత్సవాలు సందర్భంగా గురువారం జీజీహెచ్ ప్రాంగణంలో ఆర్థోపెడిక్ వైద్య విద్యార్థులు ఏర్పాటు చేసిన అవగాహనా ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా వైద్య విద్యార్థులు వ్యాయామం ఆవశ్యకత వివరిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డా లావణ్య కుమారి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో ఎవరూ శారీరక కష్టం లేకుండా జీవనం సాగిస్తున్నారని దీనితో ఎముకలు సంబంధించిన అనేక వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగ వైద్య నిపుణులు డా విఠల్ మాట్లాడుతూ వ్యాయామం జీవితంలో నిత్యకృత్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డా అనిత, ఫిజియోథెరఫి హెఓడి డా లకమన సాయినాథ్, ఆర్థో వైద్యులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా పెనుమత్రకు చెందిన ఆర్‌ఏ జేడ్పీ పాఠశాల 2002-03 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ప్రభుత్వాసుపత్రికి 5 ఫ్యాన్‌లను వితరణ చేశారు. ఈ ఫ్యాన్లు గురువారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారికి వేణు అందజేశారు. ఈ సందర్భంగా లావణ్య కుమారి 2002-03 పదో తరగతి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డా అనిత వైద్య అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో యాజమాన్య కమిటీలు

విశాలాంధ్ర - ఆలమూరు : విద్యారంగాన్ని చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు ముం దుకు వేస్తోంది. గురువారం మండ లంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. చైర్మన్ తో పాటు కమిటీ సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ మెంబర్లు, చైర్మన్, వైస్ చైర్మన్‌లు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని చేతులెత్తి ప్రతిజ్ఞ చేయించి, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

పంట పొలాలను పరిశీలించిన ఏఓ

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన వరి పంట పొలాలను గురువారం మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ పరిశీలించారు. రెండు మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు జగ్గంపేట మండలంలో చెరువులు నిండి మర్రిపాక, గొల్లల గుంట, రామవరం గ్రామాల్లో సుమారు 70 ఎకరాల్లో వరి పంట నీటి మునిగాయని ఆయన మీడియాకు తెలిపారు. నీరు పోయే మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించామన్నారు.

ఎస్ఎమ్‌సి చైర్మన్‌గా ఉమాపార్వతీ ఎన్నిక

విశాలాంధ్ర - మామిడికుదురు : నగరం హైస్కూల్‌లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్‌గా జాలెం ఉమా పార్వతీ ఎన్నికయ్యారు. గురువారం పాఠశాలలో జరిగిన ఎస్ఎమ్‌సి ఎన్నికల్లో వైస్ చైర్మన్, సభ్యులు ఆమెను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో చైర్మన్‌గా అవకాశం కల్పించడం పట్ల ఆమె కృతజ్ఞతలు చెప్పారు. పాఠశాల అభివృద్ధికి తాను అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ సభ్యులకి సర్పంచ్ జాలెం రమణ కుమారి, టీడీపీ సీనియర్ నాయకులు జాలెం సుబ్బారావు అభినందనలు తెలియజేశారు.

విద్యార్థులకు యూనిఫామ్ అందజేత

విశాలాంధ్ర - దేవరపల్లి : మండలంలోని యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు 35 మందికి స్థానిక పారిశ్రామికవేత్త శ్రీకాకొళపు కాశీ విశ్వనాథం అందించిన రూ 20,000లు పార్డ్ ఇండియా సంస్థ అందించిన రూ 17,000 ఆర్థిక సహాయంతో ప్రతి ఒక్కరికి రెండు జతల ఉచిత యూనిఫామ్ ఏర్పాటు చేశారు. స్థానిక కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కళాశాల అభి వృద్ధి కమిటీ చైర్మన్ గద్దే శ్రీనివాసరావు, పారిశ్రామి కవేత్త ఎస్.కాశీ విశ్వనాథం,పార్డ్ అధికార ప్రతినిధి డి.అచ్యుతరావు తదితరులు విద్యార్థులకు సదరు యూనిఫామ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గౌరవ ప్రతినిధి దుగ్గిరాల వీరసత్యం,మహిళా ప్రతినిధి పుట్టా వీరమణి,సభ్యులు బోడపాటి నాగ దుర్గారావు, టిడిపి గ్రామ అధ్యక్షులు బొల్లిన విజయ భాస్కర్, బీజేపీ నాయకులు మండా జనార్దనరావు, జనసేన నాయకులు శ్రీనివాసరావు,పార్డ్ ఇండియా ప్రతినిధులు ఎస్.వెంకట్రావు, బాబురావు, కళాశాల ప్రిన్సిపాల్ చత్రపతి శివాజీ పాల్గొన్నారు.

పురపాలక సంఘం - అమలాపురం

ఆర్.ఓ.సి.నెం. 758/2020-ఇ1. తేది. 08.08.2024

ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు

అమలాపురం పురపాలక సంఘ పరిధిలో బి.పి.ఎస్ 2019 & ఎల్.ఆర్.ఎస్ 2020 నుండి వచ్చిన సీజనల్ వ్యాధులు నివారణ నిధులతో నాలుగు (4) పనులకు రూ.20.0 లక్షలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా షార్టు టెండరు పిలువబడినది.
టెండరు షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది. 08-08-2024. మ.01.00ల నుండి
ముగింపు తేది. 12-08-2024 ఉ.11.00ల వరకు
మిగిలిన వివరములు www.tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.

కమీషనరు, అమలాపురం పురపాలక సంఘం

బోర్డు అనుమతి మేరకే పొగాకు పండించాలి

టొబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్

విశాలాంధ్ర-దేవరపల్లి: పొగాకు పంటను నియంత్రించాలని లేకపోతే పొగాకు రైతులకు కష్టాలు తప్పవని పొగాకు బోర్డుఇచ్చిన అనుమతి మేరకేపొగాకు పండించాలని టొబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ పేర్కొన్నారు దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం రైతు సదస్సులో పొగాకు నియంత్రణపై ఆయన మాట్లాడారు. వేలం నిర్వాహాధికారి హేమస్మిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్ యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు పంట రేటు ఆశాజనకంగా ఉందని రైతులు కూడా సంతోషంగా ఉందని అన్నారు ఇదే రేటు రాబోవు సంవత్సరంలో ఉంటుందని రైతులు భావించరాదని అన్నారు. అదనంగా పండించే పంటకు అపరాధ రుసుము ఉంటుందని ఆయన తెలిపారు. అనాధరైడ్ పొగాకు బేరసులు కూడా కట్టవద్దని ఆయన హెచ్చరించారు. బ్రెజిల్ దేశంలో 700 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో పండించే పొగాకు 170 మిలియన్ కిలోలు ఉంటుందని రాబోవు సంవత్సరం కూడా ఈ ఉత్పత్తి పెరగకుండా చూచుకోవాలని అన్నారు . కర్ణాటకలో గత సంవత్సరం 100 మిలియన్ పొగాకు ఉత్పత్తి అయిందని యశ్వంత్ కుమార్ తెలిపారు. ఈ సంవత్సరం పొగాకు అపరాధ రుసుము రద్దు వల్ల 34,000 మంది రైతులకు 116 కోట్లు లబ్ధి పొందారని చైర్మన్ యశ్వంత్ కుమార్ తెలిపారు. పొగాకు పండించే ఏరియాలో పొగాకు రైతులు పర్యావరణాన్ని రక్షించడానికి ప్రతి రైతు విధిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు . ప్రధాన మంత్రి ఫసల్ యోజన పథకం పొగాకు రైతులకు వర్తించే విధంగా రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి కేంద్ర వాణిజ్య మంత్రి దృష్టికి తీసుకు వెళ్తారని యశ్వంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎల్‌కే ప్రసాద్ వేలం నిర్వాధికారి హేమస్మిత రైతు సంఘం నేతలు కరుటూరి శ్రీనివాస్ ఆచంట గోపాలకృష్ణ కార్రు సత్యనారాయణ దిద్దుపూడి హరిబాబు యాగంటి సాయిబాబు రాజు ముమ్మారెడ్డి సత్యనారాయణ దేవరపల్లి వేలం కేంద్రం పరిధిలోని రైతు నేతలు పాల్గొన్నారు .

చిన్నారి ఆచూకీ ఎక్కడ?

శిశువు కోసం విచారణ చేపట్టిన జిల్లా అధికారులు

విశాలాంధ్ర - రాజానగరం : తమ చిన్నారి ఎక్కడ ఉందో ఆచూకీ తెలపాలని, తమ పాపని తమకు అప్పగించాలని కోరుతూ తూర్పు గానుగూడెం గ్రామానికి చెందిన ఒక కుటుంబం సోకిస్తుంది. మండలంలో తూర్పు గానుగూడెం గ్రామానికి చెందిన కర్రాపు ఆదిలక్ష్మి, అప్పారావు దంపతులు తమ కుమార్తె ఆచూకీ తెలపాలంటూ జిల్లా కలెక్టర్ కు ఇటీవలే ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిడి కె. విజయలక్ష్మి ఆధ్వర్యంలో తూర్పు గానుగూడెం గ్రామంలోనీ సచివాలయంలో స్థానిక ఎ ఎన్ఎంను గురువారం విచారణ చేపట్టారు. దీనిపై పిడి కె.విజయలక్ష్మి మాట్లాడుతూ సుమారు నాలుగేళ్ల క్రితం కర్రాపు ఆదిలక్ష్మి, అప్పారావు దంపతులు తమ కుమార్తెను స్థానిక ఎఎన్ఎం సహాయం కొందరు తీసుకుని వెళ్ళారని జిల్లా కలెక్టర్‌కి వచ్చిన ఫిర్యాదుపై తాము విచారణ చేపట్టామన్నారు. బాధితులు, ఎఎన్ఎం నుండి సేకరించిన నివేదికను జిల్లా కలెక్టర్ ప్రశాంతికి అందజేస్తామని చెప్పారు. కాగా తన పాపను ఎక్కడ ఉన్నా తీసుకుని రావాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితులు తెలిపారు. విచారణలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజ్ కుమార్, తహశీల్దార్ సునీత తదితరులు పాల్గొన్నారు.

కోరమండల్ ఇంటర్నేషనల్ సీఈఓగా శంకరసుబ్రమణియన్

విశాలాంధ్ర - కాకినాడ : కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (సిఐఎల్) డైరెక్టర్ల బోర్డు ఈ రోజు కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ యొక్క మేనేజింగ్ డైరెక్టర్ మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా న్యూట్రియంట్ బిజినెస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ శంకరసుబ్రమణియన్‌ను నియమించినట్లు వెల్లడించింది. ఈ నియామకం 7 ఆగస్టు 2024 నుండి అమలులోకి వచ్చింది. శంకరసుబ్రమణియన్ అపారమైన అనుభవాన్ని కలిగి ఉన్నారని సమస్త ప్రకటించింది. చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ బిజినెస్ హెడ్‌గా ఆయన నిరూపితమైన ట్రాక్ రికార్డ్‌ను కలిగి ఉన్నారన్నారు. మద్రాస్ విశ్వవిద్యాలయం నుండి గణిత శాస్త్ర గ్రాడ్యుయేట్ అయిన శంకరసుబ్రమణియన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సభ్యులు . 2009 సంవత్సరంలో ఆయన హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఏఎంపి) పూర్తి చేశారు. మురుగప్ప గ్రూప్‌తో ఆయన అనుబంధం 1993 లో ప్రారంభమైనది. ఆయన కార్పొరేట్ ఫైనాన్స్‌లో ఈ ఐడి ప్యారీ (ఇండియా) లిమిటెడ్‌లో తన కెరియర్‌ను ప్రారంభించారు. అక్కడ ఆయన వివిధ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉన్నత స్థాయిలకు చేరుకున్నారు. 2003లో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో చేరారు. న్యూట్రియంట్ విభాగంలో బిజినెస్ హెడ్‌గా ఉన్న ఈయన పదవీ కాలంలో, పరిశ్రమలో తన స్థానాన్ని కోరమండల్ సుస్థిరం చేసుకుని లాభదాయకంగా అభివృద్ధి చెందింది. నానో టెక్నాలజీ, డ్రోన్ స్ప్రేయింగ్ సేవలతో పాటు మైనింగ్ కార్యకలాపాల్లోకి కూడా ప్రవేశించడంద్వారా కొత్త ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోలలోకి విస్తరించింది. ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ట్యునీషియా ఇండియన్ ఫెర్టిలైజర్ ఎస్.ఏ., ట్యునీషియా, దక్షిణాఫ్రికాలోని ఫోస్కార్ లిమిటెడ్‌తో పాటు కంపెనీ కొన్ని అనుబంధ సంస్థల బోర్డులలో ఆయన తన సేవలను అందించారు.

విద్యా కమిటీల ఏర్పాటు

విశాలాంధ్ర - తాళ్లరేవు : తాళ్లరేవు మండలంలో ప్రతి గ్రామంలో గురువారం పాఠశాల విద్యా కమిటీలు ఎన్నుకొన్నారు. ఇందులోభాగంగా మల్లవరం పంచాయతీ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల ఎన్నికల్లో బళ్ళ చిరంజీవి, ఆనాల సుజాత, నేతల నాగార్జున, యం సుబ్బలక్ష్మీ, పత్తి గొంది పాఠశాలలో పంపన నాగమణి, మోకన సుధా కర్ ఎన్నికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పాఠశాల ఎన్నికల్లో తాళ్లరేవు మండలం పి మల్లవరం పంచాయతీ పరిధి లోని అన్ని పాఠశాలల్లో కూటమి సభ్యులు ఎన్నికైనారు, ఈ సందర్భంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఉద్దేశించి రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వం మీ అందరిపైనా గురుతర బాధ్యత ఉం దని, అదేవిధంగా శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు, యంపి గంటి హరీష్ బాలయోగి సహకారంతో సియస్ఆర్ నిధులతో పంచాయతీలోని అన్ని పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, పేర్రాజు, కుమార్, ధూళిపూడి సుబ్బారావు, గుత్తుల వెంకటరమణ, చిట్టూరి నాగేశ్వరరావు, పోశంశెట్టి ప్రకాష్, సబ్బతి చిన్నారి, క్రాంతి, వెంటపల్లి పురుషోత్తం, బళ్ళ నాగు, ఇంజనీర్, నిమ్మకాయల మూర్తి, చంటి వెంటపల్లి సత్యవతి, చిట్టూరి వెంకటేశ్వరావు, దున్నా బుజ్జి, బళ్ళ శ్రీను, నేతల చంటి పాల్గొన్నారు.

ఆరు నెలల్లో ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం ఎంపీగా, లోక్‌సభలో చీఫ్‌విప్‌గా పనిచేసి నగరాన్ని రోల్ మోడల్‌గా అభివృద్ధి చేసిన మార్గాని భరత్‌రామ్‌పై టీడీపీ నాయకులు నాలుక చీరేస్తామంటూ ఇష్టమొచ్చినట్టుగా అవాకులు, చెవాకులు పేలడాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా పరిగణించారు. వారికి దమ్ముంటే మార్గానిని టచ్ చేసి చూడాలని, వారి శరీరంలో అన్ని అవయవాలు చీరేసి ఎండేస్తామని వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకుడు కడలి వెంకటేశ్వరరావు సవాల్ విసిరారు. తప్పు చేస్తే చట్టం, కోర్టులు, ఎన్నికలు ఉన్నాయని వాటి ద్వారా విచారణ చేసి శిక్ష విధించాలే తప్ప ఈ విధంగా మాట్లాడటం సరికాదన్నారు. ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు గాజులు తొడుక్కుని కూర్చోలేదని కూటమి నాయకులు గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. గతంలో ఎంపీ హోదా ఆయన మంజూరు చేయించిన బిసిల కమ్యూనిటీ హాల్, శెట్టిబలిజ, గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆ పార్టీకి చెందిన బీసీ నాయకులు ప్రయత్నించాలని సూచించారు.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

BAJAJ FINANCE

నమోదిత కార్యాలయం : బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఆఫ్ పూణె-అహ్మద్ నగర్ రోడ్డు, విమన్ నగర్, పూణె-411014. **శాఖా కార్యాలయం :** బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, 23ఎ/7/19 కెకెఎస్ స్ట్రీట్, రాజాహ్ రిడ్జ్ బిల్డింగ్ ఆర్ఆర్‌పేట, ఏలూరు-534002. **అధీకృతఅధికారి వివరాలు : పేరు:** విష్ణుకైమాల్, మెయిల్ ఐడి : **vishnu.kaimal@bajajfinserv.in,** మొబైల్ నం.:917972125519

బిడ్డింగ్ నోటీసు ద్వారా బహిరంగ వేలం

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ దిసెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 ('యాక్ట్') క్రింద

క్రింద వివరించబడిన స్థిరాస్తిని మరియు పేర్కొన్న స్థిరాస్తి ('సెక్యూర్డ్ అసెట్/ఆస్తి') బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ('బిఎఫ్ఎల్') కి తనఖా పెట్టారని, సర్ఫేశీ చట్టం 2002 నియమాల ప్రకారం అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారని దీని ద్వారా దిగువ పేర్కొన్న రుణగ్రహీత/సహ-రుణగ్రహీత మరియు సాధారణంగా ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. దిగువ వివరించిన విధంగా బిఎఫ్ఎల్ కి చెల్లించాల్సిన రుణ బకాయిలు, వర్తించే వడ్డీ, ఛార్జీలు మరియు ఖర్చులు మొదలైన వాటి కోసం బిడ్డింగ్ ద్వారా సెక్యూర్డ్ అసెట్ బహిరంగ వేలం ద్వారా విక్రయించబడుతుంది. సెక్యూర్డ్ అసెట్ ను **"ఎక్కడ ఉంది" "ఏమిటి అంటే" "అక్కడ ఏమైనా"** మరియు **"రికోర్సు లేకుండా ప్రాతిపదికన"** సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్ (ఇకపై నియమాలుగా సూచిస్తారు) యొక్క రూల్ నం. 8 మరియు 9 క్రింద విక్రయించబడుతోంది మరియు బిడ్డింగ్ నిర్వహించబడుతుంది. మరియు షరతులు మరియు నియమాలు ఇక్కడ క్రింద పేర్కొనబడ్డాయి.:

రుణగ్రహీతల పేరు & చిరునామా	సహ-రుణగ్రహీతల పేరు & చిరునామా	విక్రయించబడు ఆస్తి యొక్క రికవరి కొరకు సెక్యూర్డ్ డెబిట్
రుణగ్రహీత: శ్రీ గణేష్ క్లినిక్ దాని యజమాని ద్వారా ఆర్/ఓ 3/199/1, వాణీనగర్, సెయింట్ ఆంటోనీ పబ్లిక్ స్కూల్ దగ్గర, తంగెళ్లమూడి, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఆంధ్ర ప్రదేశ్-534005 ఫోన్ :-9063508108, ఇమెయిల్: DR.PRADEEP 6930@GMAIL.COM మరియు ఆర్.ఎస్. నెం. 198, ఫ్లాట్ నెం 204, రామ తులసి రెసిడెన్సీ, మొదటి అంతస్తు, ఎల్.పి. నెం.23/2015/ఆర్, ఫ్లాట్ నెం 41,48,48& 49, కె.కె.కాజు గ్రీన్ సిటీ, మినీ బైపాస్, వెంకటాపురం పంచాయతీ, ఏలూరు బ్లాక్ -1, ఏలూరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534002	సహ-రుణగ్రహీత: కొండమూడి జాన్ ప్రదీప్ తండ్రి కొండమూడి కుమార్ బాబు 2. పసుపులేటి అనూష తండ్రి లేటు పసుపులేటి చక్రవర్తి ఇద్దరి నివాసం: ఆర్/ఓ 3/199/1, వాణీనగర్, సెయింట్ ఆంటోనీ పబ్లిక్ స్కూల్ దగ్గర, తంగెళ్లమూడి, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఆంధ్ర ప్రదేశ్- 534005 ఫోన్ :-9063508108, ఇమెయిల్: DR.PRADEEP 6930@GMAIL.COM	లోన్ ఎక్కౌంట్ నం.P566PBL3925514 లో 05.08.2024 వరకు జమ అయిన భవిష్యత్తు వడ్డీ మరియు ఛార్జీలతో పాటు మొత్తం **రూ.25,03,881/- (ఇరవై ఐదు లక్షల మూడువేల ఎనిమిది వందల ఎనభై ఒక్క రూపాయలు మాత్రమే)**

టైటిల్ హోల్డర్ పేరు	ఆస్తి వివరాలు	బిడ్లు తెరుచు ప్రదేశము, తేదీ మరియు సమయం	రిజర్వు ధర/ బిడ్/పెంపుదల	కేవైసీడాక్యుమెంట్లు/ఇఎండి వగైరా ప్రూఫ్ /పాల్గొనుటకు అభ్యర్థన లేఖ సమర్పణకు చివరి తేదీ &సమయం
కొండమూడి జాన్ ప్రదీప్	ఆంధ్రప్రదేశ్-534002, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు మండలం, ఏలూరు బ్లాక్-1, వెంకటాపురం పంచాయతీ, మినీ బైపాస్, కె.కె. కాజు గ్రీన్‌సిటీ, ప్లాట్ నం.41,48, 48&49, ఎల్.పి.నం.23/2015/ఆర్,రామ తులసి రెసిడెన్సీ, మొదటి అంతస్తు, ఆర్ఎస్ .నం.198, ఫ్లాట్ నం.204 యొక్క ఆస్తి మొత్తంగా. హద్దులు: తూర్పు: 40 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర: 40 అ॥ల వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నం.43 యొక్క స్థలం, దక్షిణం: పి అనూష స్థలం.	తేదీ: 09/09/2024 సమయం: ఉ.11.00 గం.లు ప్రదేశము: బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్. 23/ఎ/7/19 కెకెఎస్ స్ట్రీట్, రాజాహ్ రిడ్జ్ బిల్డింగ్, ఆర్ఆర్ పేట, ఏలూరు-534002	రిజర్వు ధర: రూ.34,89,750/- (ముప్పైనాలుగు లక్షల ఎనభై తొమ్మిది వేల ఏడు వందల యాభై రూపాయలు మాత్రమే) ఇఎండి: రిజర్వు ధరలో 10%. అప్పటికప్పుడు బిడ్ పెంపుదల అంగీకరించబడదు	07/09/2024 సాయంత్రం 05:00 గం.లు

ఆస్తి యొక్క తనఖీ తేది మరియు సమయం: 07/08/2024 నుండి 07/09/2024 . ఉ.10.00గం. మరియు సా.4.00గం. మధ్య

బహిరంగ వేలం యొక్క షరతులు మరియు నిబంధనలు క్రింది విధంగా :

1. బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్కు తెలిసిన లేదా తెలియని ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో ఉన్న అన్నీ భారాలతో "ఎక్కడ ఉన్నదో, "అదేదో" మరియు "రికోర్స్ లేకుండా ప్రాతిపదికన" బహిరంగ వేలం నిర్వహించబడుతోంది. బిడ్ ఫారమ్, డిక్లరేషన్, పబ్లిక్ వేలం యొక్క సాధారణ నిబంధనలు మరియు షరతులను బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, 23ఎ/7/19 కెకెఎస్ స్ట్రీట్, రాజాహ్ రిడ్జ్ బిల్డింగ్ ఆర్ఆర్‌పేట, ఏలూరు-534002.కార్యాలయం నుండి పొందవచ్చు. 2. రిజర్వు ధర కంటే తక్కువగా సెక్యూర్డ్ అసెట్ విక్రయించబడదు. 3. అధీకృత అధికారి యొక్క ఉత్తమ జ్ఞానం మరియు సమాచారం మేరకు, ఆస్తులపై ఎటువంటి భారం లేదు. ఏది ఏమైనప్పటికీ, ఉద్దేశించిన బిడ్డర్లు ఏదైనా క్లెయిమ్లు, ఛార్జీలు, బకాయిలు, భారాలకు సంబంధించి వారి స్వంత స్వతంత్ర విచారణలు చేయడం మరియు వారి బిడ్‌ను సమర్పించే ముందు ఆస్తి యొక్క టైటిల్, పరిధి/కొలత గురించి సంతృప్తి చెందడం అవసరం. ఆస్తిలో ఏదైనా వ్యత్యాసానికి, పాల్గొనే బిడ్డర్ బిడ్ సమర్పించిన తేదీ నుండి అన్ని భవిష్యత్ రీసోర్సెస్కు పూర్తిగా బాధ్యత వహిస్తాడు. 4. అమ్మకానికి ఉంచిన ఆస్తికి సంబంధించి ఎలాంటి క్లెయిమ్, ఆస్తిపై ఛార్జీలు/భారాలు లేదా మరేదైనా ఇతర విషయాలపై బిడ్ సమర్పించిన తర్వాత పరిగణించబడదు. 5. అధీకృత అధికారి/బిఎఫ్ఎల్ విక్రయించబడుతున్న ఆస్తికి సంబంధించి ఏదైనా ఛార్జీ, తాత్కాలిక హక్కు, భారం, ఆస్తి పన్ను బకాయిలు, విద్యుత్ బకాయిలు మొదలైన వాటికి లేదా ప్రభుత్వానికి, స్థానిక అధికారానికి లేదా ఎవరికైనా ఏదైనా ఇతర బకాయిలకు బాధ్యత వహించదు. 6. పబ్లిక్ వేలం నోటీసు/ప్రకటన ఏదీ ఏర్పాటు చేయదు మరియు బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క ఏదైనా ఆఫర్, నిబద్ధత లేదా ఏదైనా ప్రాతినిధ్యంగా పరిగణించబడదు. ఏదైనా థర్డ్ పార్టీ క్లెయిమ్లు/హక్కులు/బకాయిలకు అధీకృత అధికారి/బిఎఫ్ఎల్ ఏ విధంగానూ బాధ్యత వహించరు. 7. సర్ఫేచట్టం 2002 మరియు దాని నియమాల క్రింద సూచించబడిన నియమాలు/షరతులకు లోబడి విక్రయం ఉంటుంది. 8. బిడ్ సమర్పించే ముందు (ఎ) టైటిల్ మరియు లింక్ డాక్యుమెంట్లు మరియు (బి) ఆస్తిని తనిఖీ చేయడం మరియు సెక్యూర్డ్ అసెట్ మరియు స్పెసిఫికేషన్ గురించి సంతృప్తి చెందడం బిడ్డర్ల బాధ్యత. తనిఖీ కోసం ప్రాంగణంలోకి ప్రవేశించే ముందు, ఆసక్తిగల కొనుగోలుదారు వారి గుర్తింపు, చిరునామా మరియు సంప్రదింపు వివరాలను రిజిస్టర్లో వారి సంతకం క్రింద వారి ప్రవేశం మరియు నిష్క్రమణను నిర్ధారిస్తూ ఉండాలి. 9. ఆసక్తి గల బిడ్డర్లు ఇఎమ్‌డితో పాటు తమ బిడ్లను సమర్పించాలి, ఇది పైన పేర్కొన్న చివరి రోజు మరియు సమయానికి ముందు లేదా బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ అనుకూలంగా డి.డి. ద్వారా మాత్రమే చెల్లించబడుతుంది. 10. బిడ్లను ఇతర డాక్యుమెంట్లతో పాటు అధీకృత అధికారికి తప్పనిసరిగా "శ్రీ గణేష్ క్లినిక్, దాని యజమాని ద్వారా P566PBL3925514 కొనుగోలు కొరకు ఆఫర్" అని పేర్కొన్న ఒక సీల్ కవరులో బిడ్ల సమర్పణ చివరి తేదీన లేదా అంతకు ముందు అధీకృత అధికారిని చేరుకునేలా సమర్పించాలి.

10. బిడ్లు సమర్పించే సమయంలో బిడ్డర్ కింది పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది: i) ఇఎమ్‌డి చెల్లించిన రుజువు ii) పాన్ కార్డ్ కాపీ iii) గుర్తింపు రుజువు/ చిరునామా రుజువు/ఆధార్ కార్డ్/ కెవైసి (స్వీయ-ధృవీకరించబడిన కాపీలు) అది లేకుండా బిడ్ తిరస్కరించబడుతుంది. 11. బహిరంగ వేలం ప్రక్రియలో బిడ్డర్ మాత్రమే పాల్గొనవచ్చు మరియు ఇతర వ్యక్తులు అనుమతించబడరు. 12. విజయవంతమైన బిడ్డర్ అధీకృత అధికారి ఆఫర్ను అంగీకరించి, విజయవంతమైన బిడ్డర్ను ప్రకటించిన వెంటనే కొనుగోలు మొత్తంలో 25% (అప్పటికే చెల్లించిన ఇఎమ్‌డిని సర్దుబాటు చేసిన తర్వాత) డిపాజిట్ చేయాలి, లేని పక్షంలో చెల్లించిన ఇఎమ్‌డి జప్తు చేయబడుతుంది మరియు బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి బిడ్డర్ ద్వారా క్లెయిమ్ చేయబడదు. 13. కొనుగోలు మొత్తంలో మిగిలిన 75% విజయవంతమైన బిడ్డర్ ద్వారా 15 రోజులలోపు జమ చేయాలి, లేని పక్షంలో బిడ్డర్ ద్వారా ఇప్పటికే జమ చేసిన మొత్తాలు తదుపరి నోటీసు లేకుండా స్వయంచాలకంగా జప్తు చేయబడతాయి మరియు వాపసు కోసం ఎటువంటి అభ్యర్థనను స్వీకరించబడవు. తదుపరి, ఆస్తి తిరిగి వేలం వేయబడుతుంది మరియు డిఫాల్ట్ బిడ్డర్కు ఆస్తి/మొత్తానికి సంబంధించి ఎటువంటి దావా/హక్కు ఉండదు మరియు ఏదైనా ఉంటే తిరిగి వేలంలో పాల్గొనడానికి అర్హత ఉండదు. 14. సెక్యూర్డ్ అసెట్ విక్రయానికి సంబంధించి ఇఎమ్‌డికి లేదా బిడ్డర్లు/విజయవంతమైన బిడ్డర్లు డిపాజిట్ చేసిన మొత్తానికి వడ్డీ వర్తించదు. 15. కొనుగోలుదారు/విజయవంతమైన బిడ్డర్ (ఎ) వర్తించే స్టాంప్ డ్యూటీ/రిజిస్ట్రేషన్/బదిలీ ఛార్జీలను భరించాలి (బి) ఏదైనా వ్యక్తికి, సంఘం లేదా అధికారానికి సంబంధించిన అన్ని చట్టబద్ధమైన, చట్టబద్ధత లేని, మార్పిడి, విద్యుత్, మురుగునీటి ఛార్జీలు, ఏదైనా బకాయిలు, సెస్, రుసుములు, పన్నులు, రేట్లు, అసెస్మెంట్ ఛార్జీలు మొదలైనవాటిని విజయవంతమైన బిడ్డర్ మాత్రమే భరించాలి. 16. విజయవంతమైన బిడ్డర్కు అనుకూలంగా మాత్రమే నిర్ణీత ఫార్మాట్లో సేల్ సర్టిఫికేట్ జారీ చేయబడుతుంది. 17. విజయవంతమైన బిడ్డర్ ప్రస్తుతం ఉన్న స్టాంప్ మరియు రిజిస్ట్రేషన్ చట్టంలోని నిబంధనల ప్రకారం విక్రయ ధృవీకరణ పత్రం యొక్క అతని/ఆమె/దాని ఖర్చుతో రిజిస్ట్రేషన్ మొదలైనవాటిని ఏర్పాటు చేసుకోవాలి. విజయవంతమైన బిడ్డర్ రవాణా, రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, పన్నులు, రుసుము మొదలైన వాటికి వర్తించే ఛార్జీలను భరించాలి. 18. ఏదైనా భారాలకు లోబడి ఆస్తిని విక్రయించిన సందర్భంలో, విజయవంతమైన బిడ్డర్/కొనుగోలుదారు వడ్డీ, ఖర్చు, ఖర్చులు మొదలైన వాటితో సహా భారాన్ని విడుదల చేయడానికి అవసరమైన డబ్బును అధీకృత అధికారికి జమ చేయాలి. 19. ఒకవేళ బహిరంగ వేలం ఆపివేయబడినా, నిలిచిపోయినా, వాయిదా వేయబడినా లేదా రీషెడ్యూల్ చేయబడినా లేదా రద్దు చేయబడినా, బిఎఫ్ఎల్ బ్రాంచ్ నోటీసు బోర్డులో పబ్లిక్ నోటీసు ఉంచబడుతుంది మరియు ఈ విషయంలో వ్యక్తిగతీకరించిన/వ్యక్తిగత సమాచారాలు బిడ్డర్లకు లేదా ఇతరత్రా ఎవరికీ పంపబడవు. 20. బిడ్డర్ల ద్వారా బిడ్ను సమర్పించడం అనేది వారు పబ్లిక్ వేలం నిర్వహించే నిబంధనలు మరియు షరతులను చదివి, అర్థం చేసుకున్నట్లు మరియు అంగీకరించినట్లుగా భావించబడుతుంది. 21. వేలం ప్రక్రియ ముగిసిన తర్వాత విజయవంతం కాని బిడ్డర్ల ఇఎమ్‌డి తిరిగి ఇవ్వబడుతుంది. 22. అధీకృత అధికారి అత్యధిక ఆఫర్/బిడ్ అంగీకరించడానికి కట్టుబడి ఉండరు మరియు అధీకృత అధికారికి ఏదైనా లేదా అన్ని ఆఫర్(ల)ని అంగీకరించడానికి లేదా తిరస్కరించడానికి లేదా పబ్లిక్ వేలానికి ఎటువంటి కారణం చెప్పకుండానే వాయిదా వేయడానికి/వాయిదా వేయడానికి/రద్దు చేయడానికి సంపూర్ణ హక్కు ఉంటుంది. మరిన్ని వివరాల కొరకు దయచేసి సందర్శించండి.

సం/-తేది: 05.08.2024, ప్రదేశం:ఏలూరు — **సం/-అధీకృత అధికారి, ఎం/ఎస్. బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరఫున**

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత

మంత్రి కందుల దుర్గేష్

విశాలాంధ్ర - ఉండ్రాజవరం : రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్. గురువారం మండలంలోని పాలంగి, కే సావరం, చివటం, వడ్లూరు, సూర్యారావుపాలెం గ్రామాలలో ఎన్ఆర్ ఈజీఎస్ అభివృద్ధి పనులలో భాగంగా ఆయా గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకు స్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించలేదని, దాని కారణంగా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. మరింత అభివృద్ధి వైపు నిడదవోలు నియోజకవర్గం త్వరలోనే పరుగులు పెట్టిస్తానన్నారు. రహదారుల నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, సర్పంచ్‌లు బొక్క శ్రీనివాస్, నార్ని రామకృష్ణ, ఈదు పుగంటి సత్యనారాయణ, మెండే లలిత కుమారి, కూటమి నాయకులు సింహాద్రి రామకృష్ణ, వీరమళ్ళ బాలాజీ, గన్నమని సుబ్రహ్మణ్యం, కాకర్ల కరుణాకర్, కాకర్ల నాని, మద్దుకూరి శ్రీమన్నారాయణ, నందిన శ్రీనివాస్, కార్యకర్తలు అభిమానులు గ్రామ ప్రజలు, మండల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ఫెమెక్ష విపత్తు నిర్వహణ విన్యాసాలు

విశాలాంధ్ర – కాకినాడ : విపత్తు సంభవించినప్పుడు సమర్థవంతంగా రెస్క్యూ కార్యకలాపాలు నిర్వహించేలా జిల్లాలో ఫెమెక్ష విపత్తు నిర్వహణ విన్యాసాలు (FAMEX- Familiarisation Exercise Programme) నిర్వహించనున్నట్లు విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రోజెక్ట్ మేనేజర్ లావణ్య తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్డీఆర్ఎఫ్ టీమ్ కమ్మండర్ మన్మోహన్ యాదవ్. విపత్తు నిర్వహణ శాఖ జిల్లా ప్రోజెక్ట్ మేనేజర్ లావణ్యతో కలిసి రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. కాకినాడ జిల్లాలో రాబోయే 20 రోజులలో విపత్తుల నివారణా చర్యల మీద, విపత్తుల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, విపత్తుల తరువాత జరిగే పరిణామాలను ఎదుర్కొనే నైపుణ్యాలపై ప్రజలకు, విద్యార్థులకు, ఆసుపత్రి సిబ్బందికి, రసాయన ఫ్యాక్టరీల సిబ్బందికి శిక్షణ, అవగాహన కల్పించే ఉద్దేశంతో విజయవాడ నుంచి ఎన్డీఆర్ఎఫ్ టీమ్ వచ్చినట్లు తెలిపారు. జిల్లాలో తుఫాను ప్రభావిత ప్రాంతాలకు సంబంధించి 6 మండలాలలో ఫెమెక్స్ విపత్తు నిర్వహణ విన్యాసాలు నిర్వహించనున్నారన్నారు. కార్యక్రమంలో లైజింగ్ అధికారి జగదీష్ ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్ టీమ్ కమ్మండర్ మన్మోహన్ యాదవ్..విపత్తు నిర్వహణ శాఖ జిల్లా ప్రోజెక్ట్ మేనేజర్ ఎం లావణ్య జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఆర్పీ రాష్ట్ర అధ్యక్షుడు రాంజీ ప్రసాద్‌కు అభినందనలు

విశాలాంధ్ర – ప్రత్తిపాడు : విద్యాశాఖలో పనిచేస్తున్న సిఆర్పిల ఉద్యోగ భద్రత దిశగా రాష్ట్ర అధ్యక్షులుగా మీరు బాధ్యత వ్యవహరించాలని కాకినాడ జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలేషన్ అధికారి చామంతి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రత్తిపాడు మండలంలోని వివిధ గ్రామా లలో జరుగుతున్న విద్యాకమిటీ ఎన్నికల పర్యవేక్ష నిమిత్తం వచ్చి ప్రత్తిపాడు విద్యాశాఖ కార్యాలయంలో ఇటీవల సిఆర్పిల నూతన రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన ఎలిపే రాంజీ ప్రసాద్‌ను సీఎంఓ నాగేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి రాజబాబు సత్కరించారు.

దివ్యాంగుల ఉపకరణముల గుర్తింపు శిబిరం

విశాలాంధ్ర – కాకినాడ : కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసన సభ్యులు పంతం నానాజీ ఆధ్వర్యంలో రూరల్ మండలం రమణయ్యపేట పంచాయతీలో రూరల్ మండలం కార్యాలయంలో దివ్యాంగుల ఉపకరణముల గుర్తింపు శిబిరం నిర్వహించారు. వందలాదిగా దివ్యాంగులు తరలి వచ్చారు, ఎమ్మెల్యే పంతం నానాజీ శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మాకు ఎటువంటి సహకారం, సహాయం కానీ ఏమీ అందలేదని దివ్యాంగులు వాపోయారు. ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల ఉపకరణముల గుర్తింపు శిబిరము హర్షణీయమని దివ్యాంగులు హర్షం వెలిబుచ్చారు. అర్హత కలిగిన దివ్యాంగులకు త్వరితగతిన వారికి అవసరమైన ఏర్పాట్లు చేసి వాటిని అందిస్తామని శిబిరము నిర్వహించిన యాజమాన్యం దివ్యాంగులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పంతం నానాజీ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన యాజమాన్యానికి, ముఖ్యంగా జిల్లా కలెక్టర్ షన్ మోహన్ సగిలికి మరియు సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు చెప్పారు.

కాజ్‌వే పై రాకపోకలు నిలిపివేత

విశాలాంధ్ర ప్రతినిధి – ఏలూరు : తమ్మిలేరు లో వరద నీరు ఉధృతి కారణంగా ఏలూరు శనివారపు పేట లో బ్రిడ్జి పైనుండి తమ్మిలేరు నీటి ప్రవాహం పెరగడంతో ముందు జాగ్రత్త చర్యగా శనివారపు పేట కాజ్ వే పై నుండి వరద ఉధృతి తగ్గేవరకూ తాత్కాలికంగా రాకపోకలను నిలిపివేసినట్లు ఏలూరు ఆర్డీఓ ఎన్ .ఎస్.కె. ఖాజావలి తెలిపారు. శనివారపుపేట కాజ్ వే వద్ద గురువారం తమ్మిలేరు వరద ఉధృతిని ఆర్డీఓ అధికారులతో కలిసి పరిశీలించారు. ఏలూరు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డా. మాలతి ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బందితో శనివారంపేట బ్రిడ్జిపై తమ్మిలేరు నీటి ప్రవాహం కు వచ్చు అడ్డంకులను, చెత్తను దగ్గరుండి తొలగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు డిఎస్పి డి. శ్రావణ్ కుమార్, నగరపాలక సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, ప్రభుతులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 83 మందికి ఉద్యోగావకాశాలు

విశాలాంధ్ర – అమలాపురం : ప్రముఖ ప్రవేట్ కంపెనీ కేవిల్ గ్రూప్ అమెజన్ చెన్నైలో పనిచేయుటకు గురువారం 10:30 గం. నుండి జిల్లా ఉపాధి కార్యాలయం అమలాపురంలో జాబ్ మేళా నిర్వహించి. 83 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ వకాశాలు కల్పించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వసంతలక్ష్మి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని యువతను ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగానికి ఎంపికైన ఉద్యోగార్ధులు, దూరభారాలకు లోనుకాకుండా మొదటిగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అంచెలు అంచెలుగా ఎదగాలని సూచించారు. ప్రస్తుతం ఎంపిక కాబడిన ఉద్యోగం చేసు కుంటూ నైపుణ్యాలను మెరుగు పరచుకొని మంచి ఉన్నత స్థితికి చేరుకొని పలువురికి ఆదర్శంగా స్పూర్తిగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ తమ విద్యాభ్యాసం పూర్తి చేసి తమ పేరును జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో తప్పని సరిగా నమోదు చేసుకొని అర్హతకు తగ్గ ఉద్యోగ అవకాశాలను పొందాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ప్రగతి కోసం జిల్లా ఉపాధి కార్యలయం ఎప్పుడు అందుబాటులో ఉంటుందని భరోసాను ఆమె కల్పించారు. ఈ జాబ్ మేళాలో 189 యువత హాజరు కాగా 83 మంది ఉద్యో గాలకు ఎంపి కాపాడినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజకుమార్, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ మృతి తీరనిలోటు

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం జాతీయ నేత బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. 11సంవత్సరాలు పాటు బెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన బుద్ధదేవ్ రాష్ట్రాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మతతత్వ పాలనతో ప్రజాస్వామ్యం,లౌకిక రాజ్యాంగానికి దేశంలో పెనుప్రమాదం పొంచి వున్న ప్రస్తుత పరిస్థితుల్లో బుద్ధదేవ్ లాంటి నిబద్ధత కలిగిన వామపక్ష నేతలు మృతి చెందడం వామపక్ష ఉద్యమానికి, ప్రజాస్వామ్యానికి తీరని లోటన్నారు. బుద్ధదేవ్ మృతికి ఆయన సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా సమితి తరపున నివాళులర్పించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: సెప్టెంబర్ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సివిల్ కేసులు రాజీకి ప్రయత్నం చేయాలని, కేసుల రాజీకి కక్షిదారులతో మాట్లాడాలని మూడవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌పై గురువారం ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ అయితే అంతిమ తీర్పు కాబట్టి అప్పీలు చేసుకునే అవకాశం ఉండదని, సివిల్ కేసుల్లో అప్పటికే కట్టిన కోర్టు ఫీజు కూడా వాపసు వస్తుందని కక్షిదారులకు అవగాహన కలిగించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సురేష్ బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి పి.హనీషా, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్, ఉపాధ్యక్షులు కె.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఛాంబర్ అధ్యక్షులుగా బాబ్జి

విశాలాంధ్ర ప్రతినిధి – ఏలూరు : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జడ్పిటిసి ఛాంబర్ అధ్యక్షులుగా పోలనాటి శ్రీనివాసరావు (బాబ్జి)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ రావు అధ్యక్షతన ఏలూరు జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులతో ఛాంబర్ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించి, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పోలనాటి శ్రీనివాసరావు(బాబ్జి), ఉప అధ్యక్షులుగా కోరిపల్లి జయలక్ష్మి, సెక్రటరీ బొక్కా రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీ మోలుగుమాటి నీరజ, ట్రెజరర్ కొయ్యే సూర్యారావు, కార్యవర్గ సభ్యులుగా గుజ్జు రామలక్ష్మి, రణస్థల కనకదుర్గ, చిగురుపాటి శ్యామ్యూల్, మల్లం వసంతరావులను ఎన్నుకున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ పద్మశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ఆరోగ్య సేవలు అందించండి

విశాలాంధ్ర- టి.నరసాపురం: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గండిగూడెంలో పూర్తిస్థాయిలో ఆరోగ్య సేవలు అందించాలని కోరుతూ గురువారం గ్రామ ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మీడియాతో మాట్లాడుతూ గండిగూడెం గ్రామ పరిధిలో ఆశవర్కర్స్‌గా విధులు నిర్వహిస్తున్న కె లక్ష్మి మంగ, సి.హెచ్ సృజన లు గ్రామ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని పలుమార్లు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కల్పనా రాణికి విన్నవించినా సరిగా స్పందించలేదని ఆరోపిస్తున్నారు. తూతూ మంత్రంగా విచారణ పూర్తి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సరైన రీతిలో విచారణ జరిపి వారి మీద చర్యలు తీసుకుని, గండిగూడెంలో వైద్య సేవలకి అంతరాయం కలగకుండా చూడాలని కోరారు. మీ ఆందోళనలో చింతం వెంకటేశ్వరరావు, రాచబంటు వేములయ్య, కొరివి సాయి, ఆలా సోమయ్య, తట్టుకోల రాంబాబు, పాకనాటి మంగరాజు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.